ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 27 నవంబరు 2024

ప్రజల వినతులపై తక్షణం స్పందించాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, తదితరులు

- 30వ తేదీనే పింఛను పంపిణీ
- రాజ్యంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్‌కు నివాళులు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం మండల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావేదికకు సమస్యలపై వస్తున్న వినతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డిసెంబరు నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఈనెల 30వ తేదీనే పంపిణీ చేస్తామని తెలిపారు. ఉద్యోగులు ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. మండలంలో రూ.1.85 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందని, మొత్తం 52 రోడ్లు మంజూరైతే 14 మాత్రం ఇన్‌ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, వచ్చే సోమవారం లోగా అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులందరికి అపార్ ఐడీ ఇచ్చే ప్రక్రియ వేగంగా జరుగుతోందని, ఇందులో ములకలచెరువు మండలం జిల్లాలో ఐదవ స్థానంలో ఉందన్నారు. హౌసింగ్‌లో 1800 ఇళ్లకు గాను 1035 పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు కూడా వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇసుక అవసరం ఉన్న వారు దగ్గరలోని నదుల నుంచి గానీ ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడి నుంచి మనుషులను పెట్టి ట్రాక్టర్‌లో తెచ్చుకోవచ్చని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని, పోలీసులు గానీ రెవెన్యూ అధికారులు గానీ అడ్డుకోరని, ఇసుకను కుప్పగా పోసి టిప్పర్లు పెట్టి తోలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సోంపాళ్యం, ములకలచెరువులో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరినారాయణ, ఎంఈవో వెంకటరమణలతో పాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నివేదికలు పంపండి

- ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు ఉండాలి
- అధికారులతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నివేదికలు పంపాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి వెంటనే నివేదికలు తయారు చేసితమకు అందజేయాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 20 కోట్ల రూపాయలతో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ప్రస్తుతం 60 శాతం పనులు పూర్తి చేశామని, మిగతా పనులు డిసెంబరు మాసానికి పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఇంకా ఎక్కడెక్కడ సిమెంటు రోడ్లు అవసరమో అందుకు సంబంధించిన నివేదికలు తమకు వెంటనే పంపాలని ఉన్నతాధికారులతో మాట్లాడి అదనపు నిధులు మంజూరు చేయించి ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చాలా గ్రామాల్లో రోడ్లు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్ల సమస్య పరిష్కారానికి పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ దయాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమె ఓ తహసీల్దార్.. ఆ మేడమ్ అవినీతి బాగోతాలనే ప్రస్తుతం జిల్లా రెవెన్యూ శాఖలో అంతులేని కథలుగా చెప్పుకుంటున్నారు. వైసీపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్సీ భూమిని ఆన్‌లైన్ చేయడానికే లంచం అడిగిన ధైర్యం ఆమెది. కేవలం 37 సెంట్ల భూమి ఆన్‌లైన్ చేయడానికే రూ.లక్ష లంచం అడిగిందంటే.. ఇక ఎకరాలు చేయడానికి.. ఆమెకు ఎంత సమర్పించుకోవాలో.? మన ఊహకు అందకపోవచ్చు. ఈ లంచాల బాగోతానికి బయటి వాళ్లు అయితే.. ఇబ్బందని తన కింద పనిచేసే వీఆర్‌వోలనే మధ్యవర్తులుగా చేసుకుని వసూళ్లు చేస్తుంది. గతంలో ఓ పల్లెనే వైసీపీ నాయకుడికి ఆన్‌లైన్ చేసిన బరితెగింపు ఆమెది.. ఈమె నా నియోజకవర్గంలో వద్దు.. మరెక్కడైనా వేసుకోండి.. అని సాక్షాత్తు ఎమ్మెల్యేనే కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారంటే.. ఆ మేడం వసూళ్ల కహానీ ఏంటో.? ఈపాటికే అర్థం అయిపోయి ఉండాలి.



ఆ మేడమ్.. అవినీతి కథలెన్నో..

- వైసీపీ మాజీ ఎమ్మెల్సీనే లంచం అడిగిన ధైర్యం
- 37 సెంట్ల భూమికి రూ.లక్ష డిమాండ్
- వీఆర్‌వోలనే మధ్యవర్తులుగా మార్చుకుని దందా..
- ఆమె ఆగడాలు భరించలేక కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే
- గతంలో ఓ పల్లెనే వైసీపీ నాయకులకు ఆన్‌లైన్ చేసింది...
- ఆమె ఎక్కడ పనిచేసినా.. ఇదే తీరు..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్ మదనపల్లె మండల పరిధిలో భూములకు విలువ ఎక్కువగా ఉంటుంది. ఎకరా భూమి రూ.కోట్లలోనే ధర పలుకుతూ ఉంటుంది. ఈ విలువను మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీ ఆదాయ వనరుగా మార్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే ఇక్కడికి బదిలీపైన వచ్చిన ఈమె వసూళ్లకు గేట్లు ఎత్తేసిందని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. డబ్బు కోసం.. ఒకరి భూమి మరొకరికి ఆన్‌లైన్ చేస్తుంది.. అనుకుంటే.. పల్లెనే డబ్బు ఇచ్చిన వారి పేరుతో ఆన్‌లైన్ చేసేస్తుంది.. అయినా ఆమెపైన ఎటువంటి చర్యలూ ఉండవని జిల్లా రెవెన్యూ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. లంచాల వసూళ్లలో ఆమె ధైర్యం ఏంటో అందరికీ తెలియజేసే సంఘటన ఒకటి ఇటీవలే జరిగింది. ప్రస్తుతం దీని గురించే సర్వత్రా చర్చ నడుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మదనపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ నరేశ్‌కుమార్‌రెడ్డికి మదనపల్లె మండలం పోతబోలు రెవెన్యూ విలేజ్ కురవపల్లె వద్ద 32 సెంట్ల భూమి ఉంది. దానిని ఆన్‌లైన్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వీఆర్‌వో శ్రీరాములు నరేశ్‌కుమార్‌రెడ్డిని కలిసి భూమికి సంబంధించి జిరాక్స్ పేపర్లు తీసుకున్నారు. పనిలో పనిగా ఆన్‌లైన్ చేయాలంటే తహసీల్దార్ మేడం చెప్పారు రూ.లక్ష కావాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు రూ.55 వేలకు అంగీకరించారు. సాక్షాత్తు మాజీ ప్రజాప్రతినిధినైనా నా పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని అనుకున్న ఆయన ఈ విషయాన్ని శాసనసభా సమావేశాల్లో ఉన్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆగడాలు ఎక్కువయ్యాయని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే గత సోమవారం మదనపల్లెలో వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించి తహసీల్దార్ అవినీతి బాగోతాల గురించి విచారించారు. వాళ్లు చెప్పినవన్నీ విని తహసీల్దార్‌పైన ఆగ్రహం వ్యక్తం చేసి నీవు మాకు వద్దు.. సెలవులో వెళ్లిపోమని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆమె మంగళవారం సాయంత్రం 3 గంటల వరకు విధులకు హాజరు కాలేదు. వీడియో కాన్ఫరెన్స్ ఉండడంతో హాజరయ్యారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమె నా నియోజకవర్గంలోనే వద్దు.. మరెక్కడైనా వేయమని చెప్పినట్లు ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో ఆ తహసీల్దార్ లంచావతారంలో మచ్చుకు కొన్ని వెలుగులోకి వచ్చాయి.

- పోతబోలు రెవెన్యూ గ్రామంలో ఓ రైతుకు గతంలో ప్రభుత్వం డీకేటీ పట్టా భూమి ఇచ్చింది. అందులో అతను ఆవుల షెడ్డును నిర్మించుకుంటున్నాడు. దీంతో తహసీల్దార్ స్వయంగా అతడికి ఫోన్ చేసి నీకు వ్యవసాయం కోసమే ఈ భూమి ఇచ్చారు. వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నావు. నీ షెడ్డును కూల్చేస్తా అని బెదిరించినట్లు తెలిసింది. షెడ్డును కూల్చకూడదంటే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. అతను ఇవ్వకపోవడంతో ఆ షెడ్డును కూల్చడానికి జేసీబీని తీసుకెళ్లినట్లు సమాచారం. ఫోన్‌లో రైతును లంచం అడిగిన విషయం వాయిస్ రికార్డు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. అయితే మధ్యలో పెద్దమనుషులు జోక్యం చేసుకోవడంతో ప్రస్తుతానికి షెడ్డు జోలికి వెళ్లలేదని తెలిసింది.
- మదనపల్లె మండలం వెంకప్పకోట రెవెన్యూ గ్రామంలో పొలం ఉన్న బసినికొండకు చెందిన వైసీపీకి చెందిన ఓ స్థానిక సంస్థల ప్రజాప్రజానిధి పొలం మ్యుటేషన్, పాసుపుస్తకాల కోసం వీఆర్‌వో మాధవరెడ్డి ద్వారా రూ.4 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. వారం రోజుల తర్వాత ఇదే వ్యక్తి ఆ భూమి ఎన్‌వోసీ కోసం వెళ్లగా అందుకు తిరిగి రూ.రెండు లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది.

వసూళ్లలో మేడం స్టైలే వేరు...

లంచాలు వసూలు చేయడంలో మేడం స్టైలే వేరని పలువురు పేర్కొంటున్నారు. బాధితుల కథనం ప్రకారం.. ఎవరైనా రైతులు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ వివరాలు వెంటనే తహసీల్దార్ లాగిన్‌లోకి వెళతాయి. దీంతో తహసీల్దార్ ఆ గ్రామ వీఆర్‌వోతో మాట్లాడుతుంది. వెంటనే ఆ రైతుతో మాట్లాడమని ఆదేశిస్తుంది. దీంతో వీఆర్‌వోనే ఆ రైతును వెతుక్కుంటూ వెళ్లి దరఖాస్తు గురించి మాట్లాడి ఎంత ఇవ్వాలో సెటిల్ చేస్తాడు. ఒకవేళ ఆ వీఆర్‌వో సెటిల్ చేయలేకపోతే స్వయంగా మేడమే రంగంలోకి దిగుతుంది. ఫీల్డ్ చూడందే.. ఆమె సంతకం చేయదు. అయితే ఆ ఫీల్డ్ చూడడం వెనుకా... మరో కహానీ ఉంది. మేడం ఫీల్డ్‌కు వెళ్లాలంటే.. రైతు లేదా వీఆర్‌వో ఆమె వాహనానికి ఫుల్‌ట్యాంకు డీజిల్ పట్టాలి. ఒకవేళ ఒకేరోజు ఇద్దరి పొలాలు చూడడానికి వెళ్లాలంటే.. ఒకరు డీజిల్ పడితే.. మరొకరు క్యాష్ ఇవ్వాలి.. ఈ వసూళ్ల వ్యవహారం చూసుకోవడానికి గతంలో గుర్రంకొండలో తన వద్ద పనిచేసిన ఓ వీఆర్‌వోను ఇక్కడికి పిలిపించుకున్నట్లు సమాచారం. ఇతనే కాకుండా మరో వీఆర్‌వో కూడా ఆమె వసూళ్ల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ఉంటాడనే ప్రచారం ఉంది.

ఆరోపణలు వాస్తవమే.. విచారణ చేస్తున్నాం

- మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్, మదనపల్లె

తహసీల్దార్ ఖాజాబీపైన ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే. నా దృష్టికి వచ్చాయి. నేను ఆమెను పిలిపించి మాట్లాడాను. తాను లంచాలు తీసుకోలేదని చెప్పారు. ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో ఈ ఆరోపణలపై విచారించమని కలెక్టర్ ఆదేశించారు. పూర్తి స్థాయిలో విచారిస్తాము.

ఆమె ఎక్కడ పనిచేసినా.. ఇదే తీరు

ఆమె గతంలో ఉమ్మడి కడప జిల్లాలో చిట్వేలి, రామాపురం, కలెక్టరేట్ స్పందన విభాగంలో పనిచేశారు. జిల్లాల విభజన తర్వాత గుర్రంకొండ, ప్రస్తుతం మదనపల్లెలో పని చేస్తున్నారు. ఈమె పనిచేసిన ప్రతి మండలంలోనూ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. రామాపురం మండలంలో పనిచేసే సమయంలో బండపల్లె గ్రామం పొత్తుకూరుపల్లెలో సుమారు 70 సంవత్సరాలుగా ప్రజలు నివశిస్తున్న పల్లెను.. అక్కడి ఓ వైసీపీ నాయకుడి పేరు మీద ఆన్‌లైన్ చేశారు. రెవెన్యూ రికార్డుల్లో కుంటలుగా ఉన్నప్పటికీ ఆ నాయకుడి పేరు మీద ఆన్‌లైన్ చేశారు. ఇటువంటి దురాఘాతాలు ఎన్నో ఉన్నట్లు పలువురు బాధితులు పేర్కొంటున్నారు. ఈమె చేసిన అక్రమాలు, వసూళ్ల బాగోతాలు సాక్ష్యాలతో సహా బయటపడుతున్నా ఎందుకనో.. ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. కనీసం మెమో కూడా ఇవ్వడం లేదు. దీంతో ఆమె అక్రమాల వ్యవహారం రోజురోజుకు శృతి మించుతోందని పలువురు పేర్కొంటున్నారు.



కుష్టువ్యాధిని జయించారు..

- జ్యోతి కాలనీ విజయగాథ 6

బాల్యవివాహ రహిత జిల్లాగా చేస్తాం

- నేడు బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమం

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా చేయడమే ధ్యేయమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ జిల్లా వ్యాప్తంగా బుధవారం బాల్య వివాహ ముక్త్‌భారత్ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా డివిజన్, మున్సిపల్, మండల, గ్రామ స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మహిళా ఎస్‌హెచ్‌జీలు, ఎన్జీవోలు, సామాజిక స్పృహ కలిగిన ప్రైవేటు కార్యాలయాలు తదితర సంస్థలకు చెందిన సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితర సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని పౌరులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిజ్ఞ చేసి ఆ దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

6

ఆంధ్రప్రగతి

గ్రామీణ బ్యాంకును తరలించొద్దు

పిందె దశలోనే మాగిపోతున్న టమోటాలు

నకిలీ నార్లు...!



- పుట్టగొడుగుల్లా నర్సరీలు...?!
- నకిలీలతో నష్టపోతున్న టమోటా రైతులు
- నిలదీసిన రైతులపై దౌర్జన్యం
- పట్టించుకోని ఉద్యాన శాఖాధికారులు

గుర్రంకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులను దురదృష్టం వెంటాడుతోంది. రైతులు టమోటా సాగు చేసిన సమయంలో మార్కెట్‌లో ధరలు లేకపోవడం, పంట బాగా దిగుబడి వచ్చిన సమయంలో తెగుళ్లు సోకడం వంటి సమస్యలతో పాటు నకిలీ నార్లతో రైతన్నలు చితికిపోతున్నారు. ఇటీవల కొన్ని నెలలుగా మార్కెట్‌లో టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ క్రమంలో పడమటి మండలాల్లో రైతన్నలు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తున్నారు. అయితే టమోటా పంట సాగు చేసిన కొంతమంది రైతులు నకిలీ నార్లను నాటి పంట దిగుబడి రాక పూర్తిగా నష్టాలలో కూరుకుపోతున్నారు. పంట నష్టపోయిన రైతులు నర్సరీ నిర్వాహకులను ప్రశ్నిస్తే మీరు మా వద్ద నార్లు కొనలేదంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోతున్నారు.

గుర్రంకొండ మండలంలో రైతన్నలు చాలా వరకు టమోటా పంటను వేలాది ఎకరాలలో సాగు చేస్తారు. ప్రస్తుతం మండలంలో 1500 ఎకరాలలో టమోటా పంటను సాగు చేశారు. ఎకరం టమోటా పంట సాగు చేయాలంటే రూ.2.50 లక్షల వరకు ఖర్చు వస్తుంది. దీంతో రైతన్నలు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి టమోటా పంటను సాగు చేస్తున్నారు. ఈ లెక్కన రైతన్నలు 1500 ఎకరాలకు గాను రూ.50 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పంట దిగుబడి కోసం రైతన్నలు నిద్రాహారాలు మాని రాత్రింబవళ్లు తోటల వద్ద ఉంటూ కష్టపడుతున్నారు. నకిలీ నార్లతో పంట ఏపుగా పెరిగినా కాయలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని సరిమడుగు పంచాయతీ కృష్ణాపురానికి చెందిన ఓ రైతు తనకున్న రెండు ఎకరాల పొలంలో టమోటా పంట సాగు చేశాడు. గుర్రంకొండ మార్కెట్ యార్డు సమీపంలోని ఓ నర్సరీలో 34 రకం టమోటా నారును కొనుగోలు చేసి ఎకరం పొలంలో సాగు చేశాడు. ప్రస్తుతం టమోటా పంట 5 అడుగుల ఎత్తు పెరిగిందే తప్ప కాయలు కాయలేదు. ఇందుకు గాను రైతు లక్షలాది రూపాయలు ఖర్చు చేశాడు. దీంతో రైతు నర్సరీ నిర్వాహకుడి వద్దకు వెళ్లి నారు 34 రకం విత్తనం అని చెప్పి మరో రకం ఎందుకు ఇచ్చావంటూ నిలదీశాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరగడంతో నర్సరీ నిర్వాహకుడు తన వద్ద నారు కొనలేదని మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో రైతు చేసేది లేక తిరిగి వెళ్లాల్సి వచ్చింది. అలాగే మండలంలోని మద్దాహ్నంవారిపల్లెకు చెందిన ఓ రైతు గుర్రంకొండ మార్కెట్ యార్డు సమీపంలోని ఓ నర్సరీలో సాహో రకం నారు తీసుకెళ్లి పంట సాగు చేశాడు. అయితే పంట ఏపుగా పెరిగి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయాడు. ఈ నేపథ్యంలో రైతు నర్సరీ నిర్వాహకుడిని టమోటా పంట దిగుబడి చూడాలంటూ తోట వద్దకు పిలిపించి నకిలీ నారుతో నష్టపోయానని పంట నష్టం చెల్లించే వరకు ఇక్కడి నుంచి పంపించనని చెప్పడంతో గ్రామ పెద్దలు కల్పించుకుని నర్సరీ నిర్వాహకుడి నుంచి రైతుకు పరిహారం ఇప్పించారు.

నర్సరీలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం

- ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి ఉద్యాన శాఖాధికారి, వాల్మీకిపురం

గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె గ్రామాలలో ఉన్న టమోటా నర్సరీలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలిస్తాం. నర్సరీ నిర్వాహకులు రైతులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలి. అంతేకాకుండా నార్ల విక్రయంలో రైతులను తప్పుదోవ పట్టిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. రైతులకు నష్టం కలిగించే వారి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేస్తాం.



గుర్రంకొండలో ఉన్న నర్సరీ

పిందె దశలోనే మాగుతున్న టమోటాలు

టమోటా పంట నాటిన రోజు నుంచి 70 నుంచి 80 రోజుల్లో దిగుబడి వస్తుంది. నకిలీ నార్లతో టమోటా పంట సరిగా రావడం లేదు. దీంతో పంట సాగు చేసిన 40 నుంచి 50 రోజులలోపే పూత పిందెగా మారుతోంది. ఈ పిందెలే తోటలో మాగిపోతున్నాయి. ఈ క్రమంలో టమోటా పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట దిగుబడికి సమయం ఉన్నా తక్కువ కాలంలోనే కాపు వస్తుండడంతో కాయలు నాణ్యత లేక నష్టపోతున్నారు.

ఉద్యాన శాఖాధికారుల పర్యవేక్షణ ఏదీ...

గుర్రంకొండ మండలంలో రైతన్నలు సాగు చేసిన ఉద్యాన పంటలను సంబంధిత అధికారులు పర్యవేక్షించడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన టమోటా రైతులు నకిలీ నార్లు, విత్తనాలు కొని నష్టపోతున్నారు. అంతేకాకుండా గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె గ్రామాలలో నర్సరీలు రోజురోజుకు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నాయి. ఇందులో చాలా వరకు నర్సరీ నిర్వాహకులు నర్సరీలను రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. దీంతో నార్లను కొన్న రైతులకు బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో పంట నష్టపోయిన రైతులు నర్సరీ నిర్వాహకులను గట్టిగా నిలదీయలేకపోతున్నారు. ఉద్యానవన శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నర్సరీ నిర్వాహకులు విచ్చలవిడిగా నకిలీ నార్లను విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

విండ్ పవర్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

6



అనాథలు.. అభాగ్యులకు ఆసరా ఏదీ ?

7



ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోండి

6

కుష్ఠువ్యాధిని జయించారు..

- యాచక వృత్తి మానేసి..
- ఆవులు, మేకల పెంపకం...
- జ్యోతి కాలనీ విజయగాథ




పచ్చని చెట్ల మధ్య ఉన్న జ్యోతి కాలనీ

రైల్వేకోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆ కాలనీ వాసులు తీవ్రమైన కుష్ఠువ్యాధితో బాధపడేవారు. ఆదరించేవారు లేక యాచించేవారు. కుష్ఠు వ్యాధి అంటేనే అప్పట్లో భయంతో ఎవరూ దగ్గరకు వచ్చేవారు కాదు. ఎన్నో కష్టాలు, నష్టాలు అనుభవించారు. పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్న వారిలో చైతన్యం వచ్చింది. ఎలాగైనా జీవనం మెరుగుపరచుకోవాలని అడవిలో కట్టెలు కొట్టుకుని వచ్చి వాటిని అమ్ముకునేవారు. కనిపించిన వారిని జీవనోపాధి మెరుగుకోసం సాయం చేయమని అర్థించారు. తమ భవిష్యత్తు కోసం బాటలు వేయాలని, కాపాడాలని ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసుకున్నారు. అనేకమంది సాయం అందించడంతో కుష్ఠు వ్యాధిని జయించి.. కష్టాల నుంచి గట్టెక్కి తమ కాలనీని ఆదర్శ కాలనీగా మార్చుకున్నారు.

ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారందరూ కుష్ఠువ్యాధితో రైల్వేకోడూరులో యాచిస్తూ జీవనం గడిపేవారు. వారికి షెల్టర్ లేక రైల్వేస్టేషన్, రోడ్లపైనే పడుకుంటూ గడిపేవారు. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరుకు 16 కిలోమీటర్ల దూరంలో తిరుపతికి వెళ్లే మార్గంలో 1972లో జ్యోతికాలనీ అని నామకరణం చేసుకుని చిన్నపాటి గుడిసెలు వేసుకుని అక్కడే నివసించడం మొదలుపెట్టారు. కుష్ఠువ్యాధితో బాధపడుతూ పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతుండటంతో ఎల్కా అమెరికన్ లూథరన్ సంస్థ 16 మంది పిల్లలను రేణిగుంట, నాయుడుపేట ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో చేర్పించి చదివించింది. అప్పటి రాజంపేట సబ్ కలెక్టర్ బాబురాం తన కార్యాలయంలో కానుకల డబ్బాను ఏర్పాటు చేసి అందులో వచ్చిన డబ్బులతో గోధుమలు, బియ్యం తదితరాలను ఇచ్చేవారు. కుష్ఠువ్యాధిగ్రస్తులుగా ఉన్న కాలనీ వాసులు తమకు వ్యవసాయ భూమి కావాలని అభ్యర్థించారు. దివంగత టీడీపీ నేత, నెడ్‌క్యాప్ చైర్మన్ కట్టా నారాయణయ్యనాయుడు సమితి ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో జ్యోతికాలనీ వాసుల కష్టాలను తెలుసుకుని దూలాల ఇళ్లను మంజూరు చేశారు. దివంగత ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 1984లో తిరుమలకు వెళ్లి కడప మార్గంలో వెళుతుండగా జ్యోతికాలనీ వాసులు అడ్డుకుని వారి బాధలు చెప్పుకున్నారు. దీంతో వీరికి 97 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించారు. అప్పటి కలెక్టర్ అమితాబ్ భట్టాచార్య జ్యోతికాలనీ వాసులకు ఒక్కొక్కరికి 1.50 ఎకరాల వ్యవసాయ భూమిని ఇచ్చారు. రాజంపేట ఆర్డీవోగా వెంకట్రామయ్య ఉన్న సమయంలో 86 శాశ్వత గృహాలు మంజూరు చేశారు. కలెక్టర్ చల్లప్ప ఉన్న సమయంలో జ్యోతి కాలనీకి రిలీఫ్ అండ్ రిహ్యాబిలిటేషన్ కింద సొసైటీ ఏర్పాటు చేయించి ఒక్కొక్క గృహానికి అప్పట్లో రూ.6 వేలు మంజూరు చేశారు. జ్యోతి కాలనీలో 102 కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయ భూముల్లో ఐడీసీ ద్వారా బోర్లు వేయించారు.

కాలనీవాసులు హౌసింగ్ శాఖకు డబ్బులు కట్టే స్థితిలో లేనందున రైల్వేకోడూరు వీధుల్లో తిరిగి విరాళాలు సేకరించి హౌసింగ్ శాఖకు చెల్లించారు. వ్యవసాయశాఖ ద్వారా ఉచితంగా వేరుశనగ విత్తనాలు తీసుకుని సాగు మొదలు పెట్టారు. పంట చేతికి బాగా వచ్చింది. కాలనీ వాసులకు చేతులు, కాళ్లు సక్రమంగా లేని కారణంగా మామిడి తోటల పెంపకం కావాలని పోరాటం మొదలు పెట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రిన్సిపల్ కార్యదర్శిని కలసి విన్నపాలు చేసుకున్నారు. ఆయన ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయడంతో మామిడి మొక్కల పెంపకం చేపట్టారు. తోటలు బాగా అభివృద్ధి చెందాయి. తర్వాత అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జ్యోతికాలనీకి రోడ్లు, వీధి లైట్లు, ప్రభుత్వ పాఠశాల, మినీ అంగన్వాడీ స్కూలు, ఓవర్‌హెడ్ ట్యాంకు, కమ్యూనిటీ హాలు మంజూరయ్యాయి. అప్పట్లో పాఠశాలల డైరెక్టర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి సుబ్రమణ్యం జ్యోతికాలనీకి సాయం అందించారు. పిల్లలు బాగా చదువుకుని దేశంలోని ప్రధాన నగరాలతో పాటు అమెరికా తదితర దేశాల్లో స్థిరపడ్డారు. కాలనీలోని చాలామంది యువకులు ట్రాక్టర్లు, అరటికాయల లోడు వెళ్లే వ్యాన్లు తదితర వాటిని తీసుకుని జీవనోపాధి పొందుతున్నారు. పాడి పరిశ్రమను పెట్టుకున్నారు. ప్రస్తుతం ఊరిలో 65 ఆవులు ఉన్నాయి. సిల్ఫ్ సంస్థ ద్వారా రూ.9 లక్షలు తీసుకుని స్వల్ప వడ్డీతో ఆవులను పట్టుకున్నారు. ఈ గ్రామంలో 6 స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. దీంతో దినదినాభివృద్ధి చెందడంతో భిక్షాటన మానేశారు. జబ్బును పూర్తి స్థాయిలో నయం చేసుకున్నారు. ఇందుకు వైద్య, ఆరోగ్య శాఖ కూడా సహకరించింది. ఇప్పటికీ ఈ గ్రామంలో ప్రతి నెలా 11న వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆ కాలనీకి దేవుళ్లు లిలియన్, జోయల్

అమెరికాకు చెందిన లిలియన్ మేయర్, జోయల్ మేయర్‌లు జ్యోతి కాలనీకి సేవలు అందించారు. వీరు 1972లో రైల్వేకోడూరుకు వచ్చారు. వీరికి దక్షిణాంధ్ర లూథరన్ చర్చి ఆవరణలో బంగ్లా ఉండేది. అక్కడ నివాసం ఉండేవారు. జ్యోతికాలనీలో ప్రజల బాధలను గుర్తించి ఇంటి నిర్మాణాలలో పాలుపంచుకున్నారు. అవసరమైన నిధులు ఇచ్చారు. వడ్డీ లేని రుణాలు అందించారు. జ్యోతి కాలనీలో చర్చిని నిర్మించి కాలనీవాసులకు చేయూత అందించారు.

రాష్ట్రంలో 66 కాలనీలు

రాష్ట్రంలో 66 కాలనీలు ఉన్నాయి. ఎక్కువగా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ప్రాంతాల్లో కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలు కూడా రోజురోజుకు అభివృద్ధి దిశగా పయనించి ఆదర్శంగా నిలుస్తున్నారు. యాచక వృత్తి వదిలేసి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకుంటున్నారు. కాలనీల్లో యువత ఉద్యోగాల వైపు వెళ్లడంతో స్థితిగతులు మారాయి. దీంతో ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నారని చెప్పవచ్చు.


కాలనీ వాసులు పెంచుతున్న ఆవులు


కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

కాలనీల అభివృద్ధికి స్లాప్ ఏర్పాటు

రాష్ట్రంలో ఉన్న కాలనీలను అభివృద్ధి చేసుకోవడానికి స్లాప్ అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాము. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి కాలనీలను అభివృద్ధి చేసేందుకు కష్టపడ్డాము. కుష్ఠువ్యాధి అంటువ్యాధి కాదు. గతంలో వివక్ష ఉండేది. ప్రస్తుతం అది లేదు. జీవనశైలి మారింది. పిల్లలు అభివృద్ధి చెందారు. అమెరికా కంటే జ్యోతి కాలనీలో ప్రశాంత జీవనం ఉంది. ఆరోగ్యంగా ఉంటున్నాము. కాలనీ అభివృద్ధి కోసం చాలా బాధలు పడ్డాము.

- కందేరి ధనుంజేయనాయుడు, రాష్ట్ర స్లాప్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు

జ్యోతి కాలనీలో పాలధార

జ్యోతి కాలనీలో రోజుకు 100 నుంచి 150 లీటర్ల పాలు వస్తున్నాయి. వీటిని తిరుపతిలోని డెయిరీకి సరఫరా చేస్తున్నాము. గ్రామంలో 65 ఆవులు ఉన్నాయి. పాలతో జీవనశైలి మారింది. ఆర్థికంగా గ్రామస్తులు పుంజుకున్నారు.

- పత్తి వరప్రసాద్, పాల కేంద్రం నిర్వాహకుడు

ఆవులు, మేకలతో జీవనోపాధి

ఇచ్చిన ఆవులు, మేకల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నాము. ఎక్కడా ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాము. గ్రామంలో ప్రశాంతత ఉంది. కులాలు, మతాలకతీతంగా అందరం బాగా కలసి మెలసి ఉంటాము. ఎక్కడ తేడాలు లేకుండా ఉంటాయి.

- పత్తి మెహరున్నీసా, జ్యోతికాలనీ

వర్షం వస్తే ఇళ్లు ఉరుస్తున్నాయి...

వర్షం వస్తే ఇళ్లు ఉరుస్తున్నాయి. వర్షాకాలంలో కొంత ఇబ్బందిగానే ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి సాయం అందించాలి. ఎలాంటి వివక్ష లేకుండా జీవిస్తున్నాము. గతంలో చాలా ఇబ్బందులు పడ్డాము. అందరి సాయంతో ముందుకుపోతున్నాము.

- టి. మునెమ్మ, జ్యోతికాలనీ

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోండి

- వివాదాస్పద భూముల్లో జోక్యం చేసుకోం
- భూసమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ : కలెక్టర్ శ్రీధర్


పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

కురబలకోట/పెద్దతిప్పసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులు, వంకలు, రస్తా పోరంబోకు తదితర భూములను ఆక్రమించుకున్న వారికి నోటీసులివ్వాల్సిన అవసరం లేదని వాటిలో నిర్మాణాలు ఉంటే తొలగించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. కొన్ని సమయాల్లో ఆక్రమణకు గురైన భూములలో పంట సాగు చేసిన, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నివాసం ఉన్న సందర్భాలలో నోటీసులు ఇచ్చి 11 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. అలాగే వివాదాస్పద భూముల్లోకి అధికారులు జోక్యం చేసుకోరని, చట్టపరంగా కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందాలని తెలిపారు. అనంతరం కంటేవారి వారిపల్లె వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, ఎంపీడీవో గంగయ్య, ఆర్ఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

పీలేరు తహసీల్దార్‌పై ఫిర్యాదులు

పీలేరు తహసీల్దార్ భీమేశ్వరరావుపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఆయన కురబలకోట తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో అనేక భూఆక్రమాలకు పాల్పడటంతో పాటు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ భూసమస్యలపై కురబలకోటలో త్వరలో ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ పథకాల్లో ప్రగతి సాధించాలి

ప్రభుత్వం అందించే అభివృద్ధి పథకాల అమలులో సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి వందశాతం ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పీటీఎం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలలో అధికారులు మెరుగైన సాధనకు కృషి చేయాలని తెలిపారు. అపార్ ఐడీ వంద శాతం పూర్తి చేయడంలో పీటీఎం అధికారులు వెనుకబడ్డారని లక్ష్య సాధనలో పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం తుమ్మరకుంటలోని వరుకసువుపల్లె వద్ద ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ భూమిని రక్షించడంలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్ చేసిన కృషిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, హౌసింగ్ పీడీ శివయ్య, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, హౌసింగ్ ఏఈలు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిసెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

విండ్ పవర్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

- వీరబల్లిలో 1800 మెగావాట్‌ల ప్రాజెక్టు
- కడప జిల్లా గంగాదేవిపల్లెలో 252 మెగావాట్‌లతో మరో ప్రాజెక్టు
- వీరబల్లి ప్రాజెక్టుకు 676 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వ అనుమతి



కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో రెండు విండ్ పవర్ (గాలి మరలు) పాజెక్టుల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం వంగిమళ్లలో 1800 మెగావాట్‌ల సామర్థ్యంతో, కడప జిల్లా గంగాదేవిపల్లెలో 252 మెగా వాట్‌ల తోనూ రెండు విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు తదుపరి చర్యల కోసం ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వీరబల్లి మండలం వంగిమళ్ల వద్ద గతంలో ఆఫ్-స్ట్రీమ్ క్లోజ్‌డ్ లూప్ పంప్‌డ్ స్టోరేజీ (ఏసీపీఎస్‌పీ)విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ఆస్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా సంస్థ ముందుకొచ్చింది. ఇందుకు వంగిమళ్ల వద్ద 490 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టింది. అనంతరం తాము క్షేత్రస్థాయిలో సాంకేతికపరమైన అధ్యయనాలను పూర్తి చేశామని, ప్రాజెక్టు డిజైను, సామర్థ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోగా ప్రస్తుతం గుర్తించిన 490 ఎకరాలకు అదనంగా మరో 186 ఎకరాలను (మొత్తం 676) కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. సంస్థ అదనంగా కోరుతున్న 186 ఎకరాలతో మొత్తం 676 ఎకరాలను ప్రత్యామ్నాయ ఇంధన కార్పొరేషన్ ఎండీ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఆస్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్ సంస్థ కోరిన విధంగా కొన్ని షరతులతో మొత్తం 676 ఎకరాలను కేటాయించేందుకు నిర్ణయించింది.

కేటాయించిన భూములను సంస్థ కొనుగోలు చేసేటట్లయితే ఎకరాకు రూ.5 లక్షల వంతున చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది. లేదంటే లీజు పద్ధతిలో అయితే ఎకరాకు ఏడాదికి రూ.31 వేల ప్రకారం చెల్లించాలని తెలిపింది. ఈ రెండింటిలో ఏదో ఒక పద్ధతిని ఎంచుకోవడం సంస్థ నిర్ణయానికే వదిలేసింది. ఈ మేరకు వంగిమళ్ల వద్ద 676 ఎకరాలు కేటాయించి సంస్థకు అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖను ప్రభుత్వం ఆదేశించింది.

కడప జిల్లాలో గంగాదేవిపల్లె వద్ద..

కడప జిల్లా గంగాదేవిపల్లె వద్ద 252 మెగా వాట్‌ల సామర్థ్యంతో మరో విండ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి ఎకోరెన్ ఎనర్జీ ఇండియా సంస్థ ముందుకొచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వేయి మెగావాట్‌ల సామర్థ్యంతో ఏర్పాటు చేసే ప్రాజెక్టుతో పాటు గంగాదేవిపల్లె వద్ద కూడా ఒక ప్రాజెక్టు కోసం ఈ సంస్థ ప్రయత్నాలు ప్రారంభించింది. మొదట్లో గంగాదేవిపల్లె ప్రాజెక్టును గతంలో 230 మెగా వాట్‌ల సామర్థ్యంతో ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అయితే గంగాదేవిపల్లె ప్రాజెక్టు సామర్థ్యాన్ని మరో 22 మెగావాట్‌లకు పెంచి మొత్తం 252 మెగావాట్‌లతో నెలకొల్పేందుకు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఈనెల 19న జరిపిన సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం సానుకూలంగా అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును తరలించొద్దు

ప్రొద్దుటూరులోని బ్యాంకు ఎదుట సీపీఎం నాయకుల నిరసన


బ్యాంకు ఎదుట నిరసన తెలియచేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం తగదని మంగళవారం ఏపీజీబీ బ్యాంకు వద్ద సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ఏపీజీబీ బ్యాంకు ఆరు జిల్లాలకు అనుసంధానమై 1.35 కోట్ల ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, పేద ప్రజలకు అందుబాటులో ఉన్న బ్యాంకు అని తెలిపారు. అటువంటి బ్యాంకును అమరావతికి తరలించాలనుకోవడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు బ్యాంకు తరలింపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కడపలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాల్మన్, చంటి, రాఘవ, రమాదేవి, అన్నపూర్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద వివరాలు నమోదు చేసుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పశు వైద్యాధికారి

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ తమ వద్ద ఉన్న పశు సంపద వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పశుగణన కార్యక్రమం జరుగుతోందని, అన్ని రకాల పశు సంపదకు సంబంధించిన వివరాలను యజమానులు నమోదు చేసుకోవాలని కోరారు. మంగళవారం మండలంలోని కొటాల గ్రామంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువులకు సంక్రమించే గర్భకోశ వ్యాధులను గుర్తించి నివారించడంలో యజమానులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మదనపల్లె పశు సంవర్ధక ఉప సంచాలకులు డాక్టర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ చూలు నిలవడంలో పశు పోషణ ప్రాధాన్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. మదనపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు మదనపల్లె పశు వ్యాధి నివారణ శాస్త్ర నిపుణులు పశువులలో చూలు సామర్థ్యం పెరగడానికి పలు సలహాలు అందజేశారు. తిరుపతి పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహక అధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం, కలికిరి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటముని నాయుడు వైద్య శాస్త్రవేత్తల సలహాలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కేవీకే శాస్త్రవేత్తలు డా.నవీన, మాధురి, హేమకుమార్, పశు గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ గిరినాథరెడ్డి, సచివాలయ పశు సంవర్ధక సహాయకులు ఇలియాజ్, సయ్యద్ ఆలీ, అనిల్, కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది రైతులకు యూరియా, మొలాసిస్ కలిపిన దాణా బ్లాక్స్‌ను అందజేశారు.

మార్గదర్శకాన్ని సూచించేదే రాజ్యాంగం

- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో దేశ పౌరులకు మార్గదర్శకాన్ని సూచించేదే రాజ్యాంగం అని రాజ్యాంగంలోని పీఠికను ప్రతిఒక్కరూ చదివి అర్థం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను ప్రారంభించే ముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జేసీతో పాటు డీఆర్వో మధుసూదన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 1949 నవంబరు 26న ప్రజలందరి తరఫున రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని, అందువల్లనే నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అంబేడ్కర్ నాయకత్వంలో ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి మన దేశంలోని సాంస్కృతిక, భాషల, తదితర వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నామని తెలిపారు. అనంతరం రాజ్యాంగ పీఠికను కలెక్టరేట్ కో-ఆర్డినేటర్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్ చదువుతూ కార్యక్రమానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనాథలు.. అభాగ్యులకు ఆసరా ఏదీ?

- నామమాత్రంగా నైట్‌షెల్టర్లు
- పట్టించుకోని ప్రభుత్వాలు
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..
- ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్లు, బస్టాండులే ఆవాసాలుగా...
- దీనావస్థలో అనాథలు, వృద్ధులు



పాతకలెక్టరేట్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న వృద్ధులు, అనాథలు

ఎక్కడివారో తెలియదు... ఎవరైనా ఉన్నారో లేదో కూడా తెలియదు. ఎక్కడికి వెళ్లాలో తెలియదు.. తమ గురించి తాము చెప్పుకోలేని స్థితి (మతిస్థిమితం లేనివారు) వారిది.. ఇక నా అనుకున్న వారు నిర్దయగా వదిలేయడంతో తమలో తాము కుమలిపోతూ.. అచేతనావస్థలో (ముసలివారు) ఉన్న వారు కొందరు.. వీళ్లంతా ప్రతి నిత్యం మన కళ్లెదుట కనిపిస్తున్నా పట్టించుకునే వారు అరుదు... దీంతో ఇలాంటి ఎందరో అభాగ్యులు, అనాథలు ఫుట్‌పాత్‌లపై .. రైల్వేస్టేషన్, బస్టాండు, ప్రభుత్వ కార్యాలయాలను ఆవాసాలుగా చేసుకుని... ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ... చలికి వణుకుతూ కనిపిస్తుంటారు. ఎవరైనా కనికరించి ఆహారం పెడితే తినడం, లేదంటే కాళ్లు ముడుసుకుని పడుకుంటారు. ప్రభుత్వాలు గాలికి వదిలేయడంతో వీరికి ఆశ్రయం కల్పించాల్సిన నైట్ షెల్టర్లూ దీనావస్థలో ఉన్నాయి.

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో కనిపించే అనాథలు, అభాగ్యు లకు ఆశ్రయం కల్పించాలని 2017లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కడప నగరంలోని నాలుగు చోట్ల షెల్ట ర్లు ప్రారంభించాలని చర్యలు చేపట్టింది. అయితే ప్రకాశ్‌నగర్, జడ్పీ ప్రాంగణం, పాత రిమ్స్‌లో మాత్రమే మూడుచోట్ల నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో షెల్టరుకు 50మందిని కేటాయించారు. 2018లో ఈ షెల్టర్లను ప్రారంభించడం జరిగింది. అయితే రెండింటిలో ప్రకాశ్‌నగర్, పాతరిమ్స్‌లో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్లకు కాలపరిమితి పూర్తవడంతో గత ఏడాది నుంచి సేవలు నిలిచిపోయాయి. కేవలం జడ్పీప్రాంగణం లో ఉన్న నైట్‌షెల్టరు మాత్రమే కొనసాగుతోంది.

ప్రభుత్వం మారడంతో కథ మొదటికి

శాశ్వత అర్బన్ నైట్ సెంటరు నిర్మాణానికి 2017-18 సంవత్సరంలో మెప్మా ద్వారా నిర్మాణం చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు కే టాయించింది. ఇంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో మళ్లీ నైట్‌షెల్టర్ల కథ మొదటికి వచ్చిందని చెప్పాలి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ షెల్టర్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మున్సిపల్ అధికారులు వీటిపైన దృష్టిసారించలే దనే చెప్పాలి. ఇప్పటికైనా నైట్‌షెల్టర్లపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారిస్తే అభాగ్యులకు కొంత మేలు కలుగుతుందని చెప్పాలి.



జడ్పీ ప్రాంగణంలో గల ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అభాగ్యులు, అనాథలు

50 మందికి మాత్రమే పరిమితం

కడప కార్పొరేషన్ పరిధిలో ఏ సర్కిల్ చూసినా... ప్రభుత్వకార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో వందలాది మంది అభాగ్యులు అనాథలు కనిపిస్తుంటారు. అయితే కడప కార్పొరేషన్ పరిధిలో మాత్రం ఒకే నైట్ షెల్టరు ఉండడం అది కూడా 50 మందికి మాత్రమే పరిమితం కావడంతో అభాగ్యులకు ఫుట్‌పాత్‌లే శరణ్యమని చెప్పవచ్చు. ఉన్న ఒక్క షెల్టరులో కూడా వృద్ధులకు మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ షెల్టర్లలో అనాథలు, వృద్ధులు, అభాగ్యులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి అవసరమైతే రాత్రి బస ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట సమయంలో వచ్చేవారికి భోజనం ఏర్పాటు చేయాలి. కానీ కడప నగరంలో అటువంటి దాఖలాలు లేవు. ఎవరైనా దాతలు భోజన వసతి కల్పిస్తే వృద్ధులకు భోజనం పెడుతున్నారు.



ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్లు వారికి ఆవాసాలు

కడప నగరంలో రాత్రి అయితే రైల్వేస్టేషన్, బస్టాండు, పాత కలెక్టరేట్, సీఎస్ఐ ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, అరుగులమీద అనాథలు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, మతిస్థిమితం లేనివారు ఎక్కువగా కనిపిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుగాడే ప్రాంతాలైనా వారి కంటికి కనిపించకపోవడం బాధాకరం.

ప్రతి విద్యార్థికి లక్ష్యం.. ప్రణాళిక ముఖ్యం

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని రీజనల్ జాయింట్ డైరెక్టరు డాక్టర్ డిగిరి విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 2024-25 ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మహిళా సాధికారత, మహిళల విద్య ఆవశ్యకతను వివరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను ఉదహరిస్తూ విద్యార్థినుల భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా కవితల రూపంలో విద్యార్థినులు ఉన్నతభవిష్యత్తును కలిగి ఉండాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పల కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ యోగాంజనేయులు, డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ రవికుమార్, మైదుకూరు ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ శ్యామ్యుల్, డేవిడ్‌రాజ్, ఓబీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌పై అవగాహన అవసరం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ పురుగుల నివారణ పద్ధతి యాప్‌పై రైతులతో పాటు వ్యవసాయాధికారులుకు అవగాహన అవసరమని ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వీరయ్యచౌదరి అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చౌదరి మాట్లాడుతూ యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు మాట్లాడారు. వైఎస్ఆర్, అన్నమయ్యజిల్లాల ఏడీఏలు మాధవీ, మజీద్, టెక్నికల్ ఏవో గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దు : ఎస్ఈ



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

మైదుకూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలను ఎక్కడ రాజీపడకుండా వసూళ్లు చేయాలని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ అధికారులకు ఆదేశించారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులు, బిల్లుల గురించి విచారణ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యుత్ బకాయిలు చెల్లించలేని విని యోగదారుల కరెంటు కనెక్షన్ తొలగించాలన్నారు. ఈ తనిఖీలో ఇంజనీర్లు భరణి కృష్ణ, శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన సిరిగేపల్లి యశ్వంత్‌ను మంగళవారం అంబకపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ తెలిపారు. పట్టణంలోని వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న కళ్ల శృతి అనే యువతిని యశ్వంత్ గత మూడు సంవత్సరాలుగా ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యశ్వంత్‌పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. అనంతరం కడప కోర్టుకు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్టు

కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కడపనగరం ప్రకాశ్‌నగర్ వద్ద ఈ నెల 23న హోంగార్డు అతని సోదరులపై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని ప్రకాశ్‌నగర్ వద్ద అరెస్టు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ప్రకాశ్‌నగర్‌కు చెందిన హోంగార్డు షేక్ లాల్‌బాషా, అతని సోదరుడు సర్దార్‌బాషాలు ముత్తరాసుపల్లెకు చెందిన రంగాకు కొంత డబ్బు బాకీ ఉన్నారు. డబ్బు విషయమై ఈనెల 23న రంగా షేక్‌లాల్‌బాషాల మధ్య మాటామాటా పెరిగింది. దీంతో రంగా జిలానీ, అరుణ్‌కుమార్, మనోజ్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి వారిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఐదు గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాయచోటి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ నెంబరు చౌక దుకాణంలో పనిచేసే శ్రీను అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని కురవపల్లికి చెందిన శ్రీను కొంత కాలంగా పట్టణంలోని బోస్ నగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఆయన మంగళవారం ఉదయం వరిగపాపిరెడ్డిగారి పల్లెకు వెళ్లే దారిలో మృతి చెంది కనిపించాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహం పక్కనే మద్యం సీసా ఉండడంతో, మద్యంలో విషం కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

పెన్షనర్లకు కమ్యుటేషన్ కట్ చేయకుండా ప్రభుత్వ మెమో

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి 135 నెలలు నిండిన పెన్షనర్లందరికీ బేసిక్ పే నుంచి కమ్యుటేషన్ (40శాతం) మొత్తాన్ని కట్ చేయకుండా ప్రభుత్వం మెమో విడుదల చేసిందని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు నారాయణ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ఈ మెమో అమలులో ఉంటుందన్నారు. 135 నెలల పెన్షన్ కాలం ముగిసిన వారందరికీ ఈ మెమో ద్వారా ఆర్థిక లాభం కలుగుతుందని చెప్పారు. కోర్టు ఉత్తర్వులు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన మెమో ద్వారా రాష్ట్రంలోని అన్ని ట్రెజరీ కార్యాలయాలకు ఉత్తర్వులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించిన కడప చిన్నారి అమీనా



కడప స్పోర్ట్స్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : కడప నగరానికి చెంది న చెస్ క్రీడాకారిణి (8) అమీనా చదరంగంలో అంతర్జాతీయ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ (1407) సాధించింది. చెన్నై నగర రాయపేటలో గత జులైలో జరగిన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో రేటెడ్ క్రీడాకారుడిపై అమీనా విజయం సాధించడంతో ఆ రేటింగ్ దక్కినట్లు జిల్లా చెస్ కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. నగర శివారు ప్రాంత విస్‌డమ్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న అమీనా చదరంగంలో మునుముందు మరిన్ని స్ఫూర్తిదాయక విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

ప్రతి పౌరుడు రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుసుకోవాలి

- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి



జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న ప్రధాన జడ్జి శ్రీదేవి, జడ్జిలు, న్యాయవాదులు తదితరులు

కడప రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు రాజ్యాంగం ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను తప్పక తెలుసుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాముఖ్యత, ముసాయిదా కమిటీ, అవిశ్రాంత ప్రయత్నాల గురించి దేశ పౌరులకు అవగాహన కల్పించడం, గుర్తు చేయడం కోసం రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులు అర్పించేందుకు నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. పౌరుల ఆకాంక్షలకు, సమాజంలోని మార్పులకు అనుగుణంగా ఉండాలని భావించి భారత రాజ్యాంగం రూపొందించబడిందన్నారు.

విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులు

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. కడప నగరంలోని బసిరెడ్డి లా కళాశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సులను సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ నిర్వహించి భారత రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమాలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, మొదటి అదనపు, ఆరవ, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తులు వెంకటేశ్వరరావు, షేక్ ఇంతియాజ్ అహ్మద్, జి.రమేష్‌కుమార్, ఆయా కోర్టుల జడ్జిలు ప్రవీణ్‌కుమార్, కె.ప్రత్యూషకుమారి, జె.హేమ స్రవంతి, జె.నందిని, కె.బార్గ వి, జి.విజయలక్ష్మి, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అర్హులకు అందించాలి

- జడ్పీ సీఈవో ఓబులమ్మ

కడప రూరల్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఫలాలు అర్హులకు అందేలా అధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం వేడుకలను జడ్పీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వల్లూరు జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ఎస్‌ను రైతులు ఉపయోగించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యసాయశాఖాధికారి నాగేశ్వరరావు

కడప రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): పంటలకు ఆశించు పురుగులను నివారించి తద్వారా ఆశించిన దిగుబడులను సాధించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన నేషనల్ పేస్ట్ సర్వేయిలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్ఎస్) యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఏ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం పురుగుల నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖలో రైతులకు ఉపయోగకరమైన మార్పులు వస్తున్నందువలన ఎన్‌పీఎస్ఎస్ యాప్ రైతులకు చాల ఉపయోగకరమన్నారు. రైతులకు పురుగులు, తెగుళ్లు, నివారణా చర్యలు ఈ యాప్ ద్వారా త్వరగా తెలుసుకొని తద్వారా పంటలను రక్షించుకోవచ్చన్నారు. రైతులు వారి ఆండ్రాయిడ్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా ఎన్‌పీఎస్ఎస్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. దానిలో వారు పండించే పంటలకు సంబంధించి ఏదేని చీడ పీడలు ఆశించినప్పుడు వాటి ఫొటోలను యాప్‌లో ఉంచితే.. ఎలాంటి నివారణా చర్యలు తీసుకోవాలో తెలుసుకోవచ్చన్నారు. విజయవాడ కార్యాలయం నుంచి వచ్చిన ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్య చౌదరి ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలో వివరించారు. యాప్ ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎం.మాధవి, మజీద్ అహ్మద్, టెక్నికల్ ఏవో గోవర్ధన్, మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

అరాచక పాలనతో అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు

- వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చినప్పటి నుంచి అరాచక పాలనతో రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. జగన్‌పైన నిరాధార ఆరోప ణలతో పాలనను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. మంగళవారం రాయచోటిలోని వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడం మంచి సంప్రదాయం కాదన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో ఆలోచించి వ్యక్తులను కులాలతో విడదీస్తుండడం బాధాకరమ న్నారు. ఏ ఒక్కరు గొంతు విప్పినా పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేయడం, వారిని వ్యక్తిగతంగా బెదిరించడం, చట్టంలోని లొసుగుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ఎవ్వరిపై కూడా అసభ్యకర పోస్టులు పెట్టకూడదని, ముఖ్యంగా మహిళలను కించపరిచే పోస్టులను తమ పార్టీ సమర్థించదన్నారు. ప్రభుత్వ విధానాల్లో తప్పిదాలను ఎత్తి చూపితే కూడా కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు మేలు జరగ లేదని కూటమి నేతలు గగ్గోలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ లను ఆరు నెలలు అవుతున్నా ఇంతవరకు అమలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. రాయచోటి మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్ గౌస్‌ఖాన్, బీసీ సెల్ విజయభాస్కర్ పాల్గొన్నారు.


రైస్‌పుల్లింగ్ పేరిట రూ.1.34 కోట్లకు మోసం

ప్రొద్దుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రైస్ పుల్లింగ్ పేరిట రూ.134కోట్ల మోసానికి పాల్పడ్డ ముగ్గురు మహిళలపై చీటింగ్ కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. దువ్వూరు మండలం గోపలాపురం గ్రామానికి చెందిన మూలేవెంకట రమణారెడ్డి వడ్ల వ్యాపారం చేసేవాడు. అతని భార్య ఆర్టీసీ కండెక్టర్. ఆమెకు పరిచయం ఉన్న ప్రొద్దుటూరు పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శోభారాణి రైస్‌పుల్లింగ్ వ్యాపారాన్ని పరిచయం చేసింది. ఇందులో పెట్టుబడి పెడితే ఒకటికి పదింతలు డబ్బులు వస్తాయని ఆశ చూపింది. దీనికి సంబంధించి తమ కజిన్స్ అయిన బెంగళూరుకు చెందిన అపర్ణ, కదిరికి చెందిన అరుణను పరిచయం చేసింది. దీంతో రమణారెడ్డి ప్రొద్దుటూరులో తనకు తెలిసిన వారందరితో రైస్‌పుల్లింగ్ వ్యాపారంలో దాదాపు రూ.1.34 కోట్ల పెట్టుబడులు పెట్టించాడు.

అయితే వీరిలో ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి కూడా లాభం రాలేదు. దీంతో మోసం చేశారని వీరిపై మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. ఆ ముగ్గురు మహిళలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. కాగా ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.













సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

'ఇస్తిమా' ఘనంగా నిర్వహించాలి

చిన్నమండెం: మండలంలోని తూర్పుల్లి క్రాస్ వద్ద ఇస్తిమా వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముస్లిం మత పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇస్తిమా వేడుకల్లో కరెంటు, మంచినీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆదేశించారు. పెద్దమండెం మండలం కలిచర్ల గ్రామంలో కడప పెద్ద దర్గా ఆధ్వర్యంలో నిర్వహించే ఉరుసుకు సహాయ సహకారాలందిస్తామని తెలిపారు. బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసంలో ఉరుసు కమిటీ సభ్యులతో మంత్రి మాట్లాడారు.

రాష్ట్ర స్థాయి విద్యా సదస్సుకు ఆహ్వానం

జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర స్థాయి విద్యా సదస్సుకు అన్నమయ్య జిల్లా ఆర్‌జేయూ ప్రెసిడెంట్ సిద్దయ్య, ఉపాధ్యాయులు మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 15న రాయచోటిలోని డైట్ కళాశాల ప్రాంగణంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజా దర్బార్‌కు పోటెత్తిన ప్రజలు

బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి నిర్వహించిన ప్రజా దర్బారుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

క్రీడారంగంపై మక్కువ చూపాలి

వీరబల్లి: ప్రతి విద్యార్థి ఎలిమెంటరీ స్థాయి నుంచే క్రీడారంగంపై మక్కువ చూపాలని మంత్రి మండిపల్లి సూచించారు. ఉప్పరపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ క్రీడాకారిణి రెడ్డికావ్యశ్రీ అభి నందన సభలో ఆయన మాట్లాడారు. క్రీడా రంగంలో విజయాలు సాధించిన చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడి నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరస్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నాగులయ్య, డీఈవో సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్రావణి, ఎంఈవో కృష్ణయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

సిద్దవటం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా కొళాయిల్లో తాగునీరు రావడం లేదంటూ మంగళవారం జంగాల పల్లె పంచాయతీ వెలుగుపల్లెలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ జానకి మాట్లాడుతూ ఐదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి

● డ్వామా పీడీ వెంకట రత్నం

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో పురోగతి సాధించాలని డ్వామా పీడీ టి. వెంకటరత్నం ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో కోడూరు, చిట్వేలి, పెనగలూరు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సంచార్ యాప్‌లో ప్రతి రోజు ఉపాధి హామీ పనుల ఫొటోలు అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరుపై ఏపీఓలు ప్రతి రోజు నివేదికలు సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని, అవినీతి జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

పెనగలూరు : కొండూరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై మంగళవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ ప్రతాప్, కొండూరు సచివాలయంలో విచారణ చేశారు. తమకు కూలి సక్రమంగానే అందిందని, ఎటువంటి అవకతవకలు లేవని పీడీ, ఏపీడీ ఎదుట కూలీలు వివరించారు. బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లిన వారిపేర్లు కూడా మస్టర్లలో ఉండడంపై మరోసారి విచారణ చేయనున్నట్లు పీడీ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉపాధిహామీ పథకం నిధులతో మండలంలోని ఈటమాపురం, కంబాల కుంట గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్డు పనులను పీడీ తనిఖీ చేశారు.

అడవికమ్మపల్లెలో వైద్య శిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

సంబేపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవికమ్మపల్లిలో మంగళవారం వైద్య శిబి రం ఏర్పాటు చేశారు. దేవపట్ల ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి చిరంజీవి రెడ్డి జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచం పట్టిన అడవికమ్మపల్లి శీ ర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన వైద్య సిబ్బది గ్రామంలో తిరిగి, కీళ్ల జ్వరాలతో బాధపడుతున్న రోగులను గుర్తించి వైద్య సేవలు అందించారు.

రైల్వేకోడూరులో వర్షం: రైతుల ఆందోళన

రైల్వేకోడూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఒక మోస్తరు వర్షం కురవడంతో పట్టణంలోని రైల్వేస్టేషన్ రూటు, కొత్తబజారు, బలిజవీధి, రంగనాయకులపేట, ఒంటెలనగర్, ప్రధానదారుల్లో వర్షపు నీరు నిలిచింది. ఈ వర్షం మామిడి, బొప్పాయి, అరటి పంటలకు ఈ వర్షం అనుకూలంగా కాదని రైతులు అంటున్నారు. ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న మామిడి పూతకు, బొప్పాయి మొక్కల కు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తేమ ఎక్కువైతే అరటి చెట్లు కూలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంలో ముందుస్తుగా వచ్చిన పూత మాడిపోయినట్లు రైతులు తెలిపారు.

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి

చిట్వేలి, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : స్వర్ణ పంచాయతీ సైట్‌లో డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి పంచా యతీ కార్యదర్శి, సిబ్బందికి సూ చించారు. చిట్వేలి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళ వారం ఆయన ఆకస్మికంగా తని ఖీ చేశారు. రికార్డులను పరిశీలిం చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ శివకుమార్, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, శివకుమార్, సిబ్బంది నరసింహా, వెంకటేశ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గైర్హాజరైన ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం'

సిద్దవటం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రాజంపేట శాసన సభ్యుడు అమర్‌నాథ్ రెడ్డి హెచ్చరించారు. సిద్దవటం మండల అభివృద్ధి కార్యాలయ సభాభవనంలో మంగళవారం మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమావేశానికి వైద్యసిబ్బంది హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిరాజకుమారి, తహసీల్దారు మాధవీలత, ఎంఈవో విలియం బాబు, అసిస్టెంట్ సీడీపీవో శోభారాణి, అగ్రికల్చర్ ఏవో రమేష్‌రెడ్డి, ఎలక్ట్రిసిటీ ఏఈ జయచంద్ర, జడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులు, మల్లీశ్వరి, ఎంపీ టీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడిగా కిరణ్‌కుమార్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 25 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఏబీవీపీ 70వ జాతీయ మహాసభల్లో గౌనివల్లి కిరణ్‌కుమార్‌ను జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈయన ఏబీవీపీ ఆంధ్రా యూనివర్సిటీ అధ్యక్షుడుగా, రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌కు ధన్యవాదాలు తెలిపారు.



'రక్షణ, హక్కుల చట్టాల జోలికొస్తే సహించం'

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక ఉద్యోగ, కర్షకుల సంక్షేమ వ్యతిరేక విధానాలతో కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నదని జిల్లా సీపీఎం కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామాంజులు అధ్యక్ష తన ఆల్ ట్రేడ్ యూనియన్స్, అఖిల పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టం తెచ్చే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసేం తవరకు పోరాటాలు చేయాలన్నారు. రాయచోటి మాజీ శాసన సభ్యుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు చేస్తున్న ఐక్య ఉద్యమాల్లో తాము పాల్గొంటూ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రతిఘటిస్తామన్నారు. సీపీఐ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలను విరమించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, చిట్వేలి రవికుమార్, శ్రీలక్ష్మి, సురేంద్ర, పీయండీసీ శ్రీనివాసులు, ఎస్ఎస్ఏజేఏసీ జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రకృతి వ్యవసాయం మాధవయ్య, రెడ్డెయ్య, దేవరాయలు, దేవసేన గౌరి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, పండుగోల మణి, కృష్ణప్ప, విశ్వనాథనాయక్ తదితరులు పాల్గొన్నారు.



యుద్ధాలు మానవ మనుగడకు ప్రమాదకరం

రాయచోటి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): యుద్ధాలు మానవ మనుగడకు ప్రమాదకరమని ప్రముఖ వైద్యుడు బయారెడ్డి అన్నారు. మంగళవారం మాసాపేటలోని సాయిశుభ కల్యాణ మండపంలో నో వార్- సేవ్ వరల్డ్ అనే అంశంపై శాంతి కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధాలతో ప్రజల జీవనానికి, శాంతికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఆధ్యాత్మికవేత్త సతీశ్‌కుమార్ వీఆర్ విద్యాసంస్థల అధినేత వీఆర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘ నేత కొండూరు శ్రీనివాసరాజు, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూప గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఒంటిమిట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామంలో ఆంజనేయాలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలో 5 జతల ఎడ్లు పాల్గొనగా సర్పంచ్ చంద్రబాబురెడ్డి ఎద్దు ప్రథమస్థానంలో, ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన వెంకటసుబ్బా రెడ్డి ఎద్దు రెండో స్థానంలో , చాపాడు మండలం రాజువారిపేటకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఎద్దు మూడో స్థానంలో నిలిచాయి.

గుండెపోటుతో ఏవో గురుప్రసాదు మృతి


ఫైల్ ఫొటో

లక్కిరెడ్డిపల్లె,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రతిజ్ఞ చేసిన అనంతరం గుండెపోటు రావడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఏవో మృతి చెందాడు. ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపిన వివరాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న గురుప్రసాద్ ఎంపీడీఓ సభా భవనంలో రాజ్యాంగం, విధులపై సమావేశం నిర్వస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో సిబ్బంది ఆయనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విధులకు వెళ్లిన తన భర్త శవమై ఇంటికి వస్తున్నాడని భార్యతో పాటు కుటుంబ స భ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు.

గ్రామాలు పరిశుభ్రంగా పెట్టుకోండి

సిద్దవటం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం గ్రామ సర్పంచ్ నాగరాణి అధ్యక్షతన వీధుల్లోని చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్ పనులను పరిశీలించారు.



అన్ని మతాల పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం


రాజంపేటలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో అన్ని మతాల ప్రజల, హక్కులను గౌరవించే విధంగా భారత రాజ్యాంగం రాశారని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ శంకర్, రజక సంఘం జిల్లా కార్యదర్శి వీరబల్లి శ్రీనివాసులు, న్యాయవాది హుమయూన్‌బాషా, శ్రీనివాసులుగౌడ్, మైనార్టీ నాయకులు అమీర్‌బాషా, అబ్దుల్‌రెహమాన్, అరటికాయల బాషా తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి, తహసీల్దారు పీర్‌మున్నీ, ఎంపీడీవో తదితరులు వారివారి కార్యాలయాల్లో నివాళులర్పించారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో స్టోన్ విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగం ప్రజాస్వామ్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సిద్దవటం: మండల పరిధిలోని బాకరాపేట సమీపంలో ఉన్న పోలీసు బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కుష్ఠువ్యాధిని జయించారు..

- యాచక వృత్తి మానేసి..
- ఆవులు, మేకల పెంపకం...
- జ్యోతి కాలనీ విజయగాథ



రైల్వేకోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆ కాలనీ వాసులు తీవ్రమైన కుష్ఠువ్యాధితో బాధపడేవారు. ఆదరించేవారు లేక యాచించేవారు. కుష్ఠు వ్యాధి అంటేనే అప్పట్లో భయంతో ఎవరూ దగ్గరకు వచ్చేవారు కాదు. ఎన్నో కష్టాలు, నష్టాలు అనుభవించారు. పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్న వారిలో చైతన్యం వచ్చింది. ఎలాగైనా జీవనం మెరుగుపరచుకోవాలని అడవిలో కట్టెలు కొట్టుకుని వచ్చి వాటిని అమ్ముకునేవారు. కనిపించిన వారిని జీవనోపాధి మెరుగుకోసం సాయం చేయమని అర్థించారు. తమ భవిష్యత్తు కోసం బాటలు వేయాలని, కాపాడాలని ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసుకున్నారు. అనేకమంది సాయం అందించడంతో కుష్ఠు వ్యాధిని జయించి.. కష్టాల నుంచి గట్టెక్కి తమ కాలనీని ఆదర్శ కాలనీగా మార్చుకున్నారు.

ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారందరూ కుష్ఠువ్యాధితో రైల్వేకోడూరులో యాచిస్తూ జీవనం గడిపేవారు. వారికి షెల్టర్ లేక రైల్వేస్టేషన్, రోడ్లపైనే పడుకుంటూ గడిపేవారు. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరుకు 16 కిలోమీటర్ల దూరంలో తిరుపతికి వెళ్లే మార్గంలో 1972లో జ్యోతికాలనీ అని నామకరణం చేసుకుని చిన్నపాటి గుడిసెలు వేసుకుని అక్కడే నివసించడం మొదలుపెట్టారు. కుష్ఠువ్యాధితో బాధపడుతూ పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతుండటంతో ఎల్కా అమెరికన్ లూథరన్ సంస్థ 16 మంది పిల్లలను రేణిగుంట, నాయుడుపేట ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో చేర్పించి చదివించింది. అప్పటి రాజంపేట సబ్ కలెక్టర్ బాబురాం తన కార్యాలయంలో కానుకల డబ్బాను ఏర్పాటు చేసి అందులో వచ్చిన డబ్బులతో గోధుమలు, బియ్యం తదితరాలను ఇచ్చేవారు. కుష్ఠువ్యాధిగ్రస్తులుగా ఉన్న కాలనీ వాసులు తమకు వ్యవసాయ భూమి కావాలని అభ్యర్థించారు. దివంగత టీడీపీ నేత, సెడ్‌క్యాప్ ఛైర్మన్ కట్టా నారాయణయ్యనాయుడు సమితి ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో జ్యోతికాలనీ వాసుల కష్టాలను తెలుసుకుని దూలాల ఇళ్లను మంజూరు చేశారు. దివంగత ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 1984లో తిరుమలకు వెళ్లి కడప మార్గంలో వెళుతుండగా జ్యోతికాలనీ వాసులు అడ్డుకుని వారి బాధలు చెప్పుకున్నారు. దీంతో వీరికి 97 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించారు. అప్పటి కలెక్టర్ అమితాబ్ భట్టాచార్య జ్యోతికాలనీ వాసులకు ఒక్కొక్కరికి 1.50 ఎకరాల వ్యవసాయ భూమిని ఇచ్చారు. రాజంపేట ఆర్డీవోగా వెంకట్రామయ్య ఉన్న సమయంలో 86 శాశ్వత గృహాలు మంజూరు చేశారు. కలెక్టర్ చల్లప్ప ఉన్న సమయంలో జ్యోతి కాలనీకి రిలీఫ్ అండ్ రిహ్యాబిలిటేషన్ కింద సొసైటీ ఏర్పాటు చేయించి ఒక్కొక్క గృహానికి అప్పట్లో రూ.6 వేలు మంజూరు చేశారు. జ్యోతి కాలనీలో 102 కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయ భూముల్లో ఐడీసీ ద్వారా బోర్లు వేయించారు.


పచ్చని చెట్ల మధ్య ఉన్న జ్యోతి కాలనీ

కాలనీవాసులు హౌసింగ్ శాఖకు డబ్బులు కట్టే స్థితిలో లేనందున రైల్వేకోడూరు వీధుల్లో తిరిగి విరాళాలు సేకరించి హౌసింగ్ శాఖకు చెల్లించారు. వ్యవసాయశాఖ ద్వారా ఉచితంగా వేరుశనగ విత్తనాలు తీసుకుని సాగు మొదలు పెట్టారు. పంట చేతికి బాగా వచ్చింది. కాలనీ వాసులకు చేతులు, కాళ్లు సక్రమంగా లేని కారణంగా మామిడి తోటల పెంపకం కావాలని పోరాటం మొదలు పెట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రిన్సిపల్ కార్యదర్శిని కలసి విన్నపాలు చేసుకున్నారు. ఆయన ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయడంతో మామిడి మొక్కల పెంపకం చేపట్టారు. తోటలు బాగా అభివృద్ధి చెందాయి. తర్వాత అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జ్యోతికాలనీకి రోడ్లు, వీధి లైట్లు, ప్రభుత్వ పాఠశాల, మినీ అంగన్వాడీ స్కూలు, ఓవర్‌హెడ్ ట్యాంకు, కమ్యూనిటీ హాలు మంజూరయ్యాయి. అప్పట్లో పాఠశాలల డైరెక్టర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి సుబ్రమణ్యం జ్యోతికాలనీకి సాయం అందించారు. పిల్లలు బాగా చదువుకుని దేశంలోని ప్రధాన నగరాలతో పాటు అమెరికా తదితర దేశాల్లో స్థిరపడ్డారు. కాలనీలోని చాలామంది యువకులు ట్రాక్టర్లు, అరటికాయల లోడు వెళ్లే వ్యాన్లు తదితర వాటిని తీసుకుని జీవనోపాధి పొందుతున్నారు. పాడి పరిశ్రమను పెట్టుకున్నారు. ప్రస్తుతం ఊరిలో 65 ఆవులు ఉన్నాయి. సిల్ఫ్ సంస్థ ద్వారా రూ.9 లక్షలు తీసుకుని స్వల్ప వడ్డీతో ఆవులను పట్టుకున్నారు. ఈ గ్రామంలో 6 స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. దీంతో దినదినాభివృద్ధి చెందడంతో భిక్షాటన మానేశారు. జబ్బును పూర్తి స్థాయిలో నయం చేసుకున్నారు. ఇందుకు వైద్య, ఆరోగ్య శాఖ కూడా సహకరించింది. ఇప్పటికీ ఈ గ్రామంలో ప్రతి నెలా 11న వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆ కాలనీకి దేవుళ్లు లిలియన్, జోయల్

అమెరికాకు చెందిన లిలియన్ మేయర్, జోయల్ మేయర్‌లు జ్యోతి కాలనీకి సేవలు అందించారు. వీరు 1972లో రైల్వేకోడూరుకు వచ్చారు. వీరికి దక్షిణాంధ్ర లూథరన్ చర్చి ఆవరణలో బంగ్లా ఉండేది. అక్కడ నివాసం ఉండేవారు. జ్యోతికాలనీలో ప్రజల బాధలను గుర్తించి ఇంటి నిర్మాణాలలో పాలుపంచుకున్నారు. అవసరమైన నిధులు ఇచ్చారు. వడ్డీ లేని రుణాలు అందించారు. జ్యోతి కాలనీలో చర్చిని నిర్మించి కాలనీవాసులకు చేయూత అందించారు.


కాలనీ వాసులు పెంచుతున్న ఆవులు


కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

రాష్ట్రంలో 66 కాలనీలు

రాష్ట్రంలో 66 కాలనీలు ఉన్నాయి. ఎక్కువగా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ప్రాంతాల్లో కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలు కూడా రోజురోజుకు అభివృద్ధి దిశగా పయనించి ఆదర్శంగా నిలుస్తున్నారు. యాచక వృత్తి వదిలేసి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నారు. కాలనీల్లో యువత ఉద్యోగాల వైపు వెళ్లడంతో స్థితిగతులు మారాయి. దీంతో ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నారని చెప్పవచ్చు.

కాలనీల అభివృద్ధికి స్లాప్ ఏర్పాటు

రాష్ట్రంలో ఉన్న కాలనీలను అభివృద్ధి చేసుకోవడానికి స్లాప్ అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాము. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి కాలనీలను అభివృద్ధి చేసేందుకు కష్టపడ్డాము. కుష్ఠువ్యాధి అంటువ్యాధి కాదు. గతంలో వివక్ష ఉండేది. ప్రస్తుతం అది లేదు. జీవనశైలి మారింది. పిల్లలు అభివృద్ధి చెందారు. అమెరికా కంటే జ్యోతి కాలనీలో ప్రశాంత జీవనం ఉంది. ఆరోగ్యంగా ఉంటున్నాము. కాలనీ అభివృద్ధి కోసం చాలా బాధలు పడ్డాము.

- కందేరి ధనుంజేయనాయుడు, రాష్ట్ర స్లాప్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు

జ్యోతి కాలనీలో పాలధార

జ్యోతి కాలనీలో రోజుకు 100 నుంచి 150 లీటర్ల పాలు వస్తున్నాయి. వీటిని తిరుపతిలోని డెయిరీకి సరఫరా చేస్తున్నాము. గ్రామంలో 65 ఆవులు ఉన్నాయి. పాలతో జీవనశైలి మారింది. ఆర్థికంగా గ్రామస్తులు పుంజుకున్నారు.

- పత్తి వరప్రసాద్, పాల కేంద్రం నిర్వాహకుడు

ఆవులు, మేకలతో జీవనోపాధి

ఇచ్చిన ఆవులు, మేకల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నాము. ఎక్కడా ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాము. గ్రామంలో ప్రశాంతత ఉంది. కులాలు, మతాలకతీతంగా అందరం బాగా కలసి మెలసి ఉంటాము. ఎక్కడ తేడాలు లేకుండా ఉంటాయి.

- పత్తి మెహరున్నిసా, జ్యోతికాలనీ

వర్షం వస్తే ఇళ్లు ఉరుస్తున్నాయి...

వర్షం వస్తే ఇళ్లు ఉరుస్తున్నాయి. వర్షాకాలంలో కొంత ఇబ్బందిగానే ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి సాయం అందించాలి. ఎలాంటి వివక్ష లేకుండా జీవిస్తున్నాము. గతంలో చాలా ఇబ్బందులు పడ్డాము. అందరి సాయంతో ముందుకుపోతున్నాము.

- టి. మునెమ్మ, జ్యోతికాలనీ

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోండి

- వివాదాస్పద భూముల్లో జోక్యం చేసుకోం
- భూసమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ : కలెక్టర్ శ్రీధర్

కురబలకోట/పెద్దతిప్పసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులు, వంకలు, రస్తా పోరంబోకు తదితర భూములను ఆక్రమించుకున్న వారికి నోటీసులివ్వాల్సిన అవసరం లేదని వాటిలో నిర్మాణాలు ఉంటే తొలగించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. కొన్ని సమయాల్లో ఆక్రమణకు గురైన భూములలో పంట సాగు చేసిన, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నివాసం ఉన్న సందర్భాలలో నోటీసులు ఇచ్చి 11 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. అలాగే వివాదాస్పద భూముల్లోకి అధికారులు జోక్యం చేసుకోరని, చట్టపరంగా కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందాలని తెలిపారు. అనంతరం కంటేవారి వారిపల్లె వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, ఎంపీడీవో గంగయ్య, ఆర్ఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

పీలేరు తహసీల్దార్‌పై ఫిర్యాదులు

పీలేరు తహసీల్దార్ భీమేశ్వరరావుపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఆయన కురబలకోట తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో అనేక భూఆక్రమాలకు పాల్పడటంతో పాటు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ భూసమస్యలపై కురబలకోటలో త్వరలో ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రభుత్వ పథకాల్లో ప్రగతి సాధించాలి

ప్రభుత్వం అందించే అభివృద్ధి పథకాల అమలులో సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి వందశాతం ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పీటీఎం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలలో అధికారులు మెరుగైన సాధనకు కృషి చేయాలని తెలిపారు. అపార్ ఐడీ వంద శాతం పూర్తి చేయడంలో పీటీఎం అధికారులు వెనుకబడ్డారని లక్ష్య సాధనలో పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం తుమ్మరకుంటలోని వరుకసువుపల్లె వద్ద ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ భూమిని రక్షించడంలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్ చేసిన కృషిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, హౌసింగ్ పీడీ శివయ్య, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, హౌసింగ్ ఏఈలు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిసెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

విండ్ పవర్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

- వీరబల్లిలో 1800 మెగావాట్‌ల ప్రాజెక్టు
- కడప జిల్లా గంగాదేవిపల్లెలో 252 మెగావాట్‌లతో మరో ప్రాజెక్టు
- వీరబల్లి ప్రాజెక్టుకు 676 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వ అనుమతి



కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో రెండు విండ్ పవర్ (గాలి మరలు) పాజెక్టుల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం వంగిమళ్లలో 1800 మెగావాట్‌ల సామర్థ్యంతో, కడప జిల్లా గంగాదేవిపల్లెలో 252 మెగా వాట్‌ల తోనూ రెండు విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు తదుపరి చర్యల కోసం ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వీరబల్లి మండలం వంగిమళ్ల వద్ద గతంలో ఆఫ్-స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజీ (ఏసీపీఎస్‌పీ)విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా సంస్థ ముందుకొచ్చింది. ఇందుకు వంగిమళ్ల వద్ద 490 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టింది. అనంతరం తాము క్షేత్రస్థాయిలో సాంకేతికపరమైన అధ్యయనాలను పూర్తి చేశామని, ప్రాజెక్టు డిజైను, సామర్థ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోగా ప్రస్తుతం గుర్తించిన 490 ఎకరాలకు అదనంగా మరో 186 ఎకరాలను (మొత్తం 676) కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. సంస్థ అదనంగా కోరుతున్న 186 ఎకరాలతో మొత్తం 676 ఎకరాలను ప్రత్యామ్నాయ ఇంధన కార్పొరేషన్ ఎండీ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్ సంస్థ కోరిన విధంగా కొన్ని షరతులతో మొత్తం 676 ఎకరాలను కేటాయించేందుకు నిర్ణయించింది.

కేటాయించిన భూములను సంస్థ కొనుగోలు చేసేటట్లయితే ఎకరాకు రూ.5 లక్షల వంతున చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది. లేదంటే లీజు పద్ధతిలో అయితే ఎకరాకు ఏడాదికి రూ.31 వేల ప్రకారం చెల్లించాలని తెలిపింది. ఈ రెండింటిలో ఏదో ఒక పద్ధతిని ఎంచుకోవడం సంస్థ నిర్ణయానికే వదిలేసింది. ఈ మేరకు వంగిమళ్ల వద్ద 676 ఎకరాలు కేటాయించి సంస్థకు అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖను ప్రభుత్వం ఆదేశించింది.

కడప జిల్లాలో గంగాదేవిపల్లె వద్ద..

కడప జిల్లా గంగాదేవిపల్లె వద్ద 252 మెగా వాట్‌ల సామర్థ్యంతో మరో విండ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి ఎకోరెన్ ఎనర్జీ ఇండియా సంస్థ ముందుకొచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వేయి మెగావాట్‌ల సామర్థ్యంతో ఏర్పాటు చేసే ప్రాజెక్టుతో పాటు గంగాదేవిపల్లె వద్ద కూడా ఒక ప్రాజెక్టు కోసం ఈ సంస్థ ప్రయత్నాలు ప్రారంభించింది. మొదట్లో గంగాదేవిపల్లె ప్రాజెక్టును గతంలో 230 మెగా వాట్‌ల సామర్థ్యంతో ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అయితే గంగాదేవిపల్లె ప్రాజెక్టు సామర్థ్యాన్ని మరో 22 మెగావాట్‌లకు పెంచి మొత్తం 252 మెగావాట్‌లతో నెలకొల్పేందుకు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఈనెల 19న జరిపిన సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం సానుకూలంగా అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును తరలించొద్దు

ప్రొద్దుటూరులోని బ్యాంకు ఎదుట సీపీఎం నాయకుల నిరసన


బ్యాంకు ఎదుట నిరసన తెలియచేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం తగదని మంగళవారం ఏపీజీబీ బ్యాంకు వద్ద సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ఏపీజీబీ బ్యాంకు ఆరు జిల్లాలకు అనుసంధానమై 1.35 కోట్ల ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, పేద ప్రజలకు అందుబాటులో ఉన్న బ్యాంకు అని తెలిపారు. అటువంటి బ్యాంకును అమరావతికి తరలించాలనుకోవడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు బ్యాంకు తరలింపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కడపలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాల్మన్, చంటి, రాఘవ, రమాదేవి, అన్నపూర్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద వివరాలు నమోదు చేసుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పశు వైద్యాధికారి

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ తమ వద్ద ఉన్న పశు సంపద వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పశుగణన కార్యక్రమం జరుగుతోందని, అన్ని రకాల పశు సంపదకు సంబంధించిన వివరాలను యజమానులు నమోదు చేసుకోవాలని కోరారు. మంగళవారం మండలంలోని కొటాల గ్రామంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువులకు సంక్రమించే గర్భకోశ వ్యాధులను గుర్తించి నివారించడంలో యజమానులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మదనపల్లె పశు సంవర్థక ఉప సంచాలకులు డాక్టర్ కె.సత్యానారాయణ మాట్లాడుతూ చూలు నిలవడంలో పశు పోషణ ప్రాధాన్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. మదనపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు మదనపల్లె పశు వ్యాధి నివారణ శాస్త్ర నిపుణులు పశువులలో చూలు సామర్థ్యం పెరగడానికి పలు సలహాలు అందజేశారు. తిరుపతి పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహక అధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం, కలికిరి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటముని నాయుడు వైద్య శాస్త్రవేత్తల సలహాలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కేవీకే శాస్త్రవేత్తలు డా.నవీన, మాధురి, హేమకుమార్, పశు గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ గిరినాథరెడ్డి, సచివాలయ పశు సంవర్థక సహాయకులు ఇలియాజ్, సయ్యద్ అలీ, అనిల్, కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది రైతులకు యూరియా, మొలాసిస్ కలిపిన దాణా బ్లాక్స్‌ను అందజేశారు.

మార్గదర్శకాన్ని సూచించేదే రాజ్యాంగం

- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో దేశ పౌరులకు మార్గదర్శకాన్ని సూచించేదే రాజ్యాంగం అని రాజ్యాంగంలోని పీఠికను ప్రతిఒక్కరూ చదివి అర్థం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను ప్రారంభించే ముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జేసీతో పాటు డీఆర్వో మధుసూదన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 1949 నవంబరు 26న ప్రజలందరి తరపున రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని, అందువల్లనే నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అంబేడ్కర్ నాయకత్వంలో ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి మన దేశంలోని సాంస్కృతిక, భాషల, తదితర వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నామని తెలిపారు. అనంతరం రాజ్యాంగ పీఠికను కలెక్టరేట్ కో-ఆర్డినేటర్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్ చదువుతూ కార్యక్రమానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనాథలు.. అభాగ్యులకు ఆసరా ఏదీ?

- నామమాత్రంగా నైట్‌షెల్టర్లు ● పట్టించుకోని ప్రభుత్వాలు
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..
- ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్లు, బస్టాండులే ఆవాసాలుగా...
- దీనావస్థలో అనాథలు, వృద్ధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో కనిపించే అనాథలు, అభాగ్యు లకు ఆశ్రయం కల్పించాలని 2017లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కడప నగరంలోని నాలుగు చోట్ల షెల్ట ర్లు ప్రారంభించాలని చర్యలు చేపట్టింది. అయితే ప్రకాశ్‌నగర్, జడ్పీ ప్రాంగణం, పాత రిమ్స్‌లో మాత్రమే మూడుచోట్ల నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో షెల్టరుకు 50మందిని కేటాయించారు. 2018లో ఈ షెల్టర్లను ప్రారంభించడం జరిగింది. అయితే రెండింటిలో ప్రకాశ్‌నగర్, పాతరిమ్స్‌లో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్లకు కాలపరిమితి పూర్తవడంతో గత ఏడాది నుంచి సేవలు నిలిచిపోయాయి. కేవలం జడ్పీప్రాంగణం లో ఉన్న నైట్‌షెల్టరు మాత్రమే కొనసాగుతోంది.

ప్రభుత్వం మారడంతో కథ మొదటికి

శాశ్వత అర్బన్ నైట్ సెంటరు నిర్మాణానికి 2017-18 సంవత్సరంలో మెప్మా ద్వారా నిర్మాణం చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు కే టాయించింది. ఇంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో మళ్లీ నైట్‌షెల్టర్ల కథ మొదటికి వచ్చిందని చెప్పాలి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ షెల్టర్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మున్సిపల్ అధికారులు వీటిపైన దృష్టిసారించలేదనే చెప్పాలి. ఇప్పటికైనా నైట్‌షెల్టర్లపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారిస్తే అభాగ్యులకు కొంత మేలు కలుగుతుందని చెప్పాలి.



పాతకలెక్టరేట్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న వృద్ధులు, అనాథలు

> ఎక్కడివారో తెలియదు... ఎవరైనా ఉన్నారో లేదో కూడా తెలియదు. ఎక్కడికి వెళ్లాలో తెలియదు.. తమ గురించి తాము చెప్పుకోలేని స్థితి (మతిస్థిమితం లేనివారు) వారిది.. ఇక నా అనుకున్న వారు నిర్దయగా వదిలేయడంతో తమలో తాము కుమిలిపోతూ.. అచేతనావస్థలో (ముసలివారు) ఉన్న వారు కొందరు.. వీళ్లంతా ప్రతి నిత్యం మన కళ్లెదుట కనిపిస్తున్నా పట్టించుకునే వారు అరుదు... దీంతో ఇలాంటి ఎందరో అభాగ్యులు, అనాథలు ఫుట్‌పాత్‌లపై .. రైల్వేస్టేషన్, బస్టాండు, ప్రభుత్వ కార్యాలయాలను ఆవాసాలుగా చేసుకుని... ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ... చలికి వణుకుతూ కనిపిస్తుంటారు. ఎవరైనా కనికరించి ఆహారం పెడితే తినడం, లేదంటే కాళ్లు ముడుసుకుని పడుకుంటారు. ప్రభుత్వాలు గాలికి వదిలేయడంతో వీరికి ఆశ్రయం కల్పించాల్సిన నైట్ షెల్టర్లూ దీనావస్థలో ఉన్నాయి.





జడ్పీ ప్రాంగణంలో గల ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అభాగ్యులు, అనాథలు

50 మందికి మాత్రమే పరిమితం

కడప కార్పొరేషన్ పరిధిలో ఏ సర్కిల్ చూసినా... ప్రభుత్వకార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో వందలాది మంది అభాగ్యులు అనాథలు కనిపిస్తుంటారు. అయితే కడప కార్పొరేషన్ పరిధిలో మాత్రం ఒకే నైట్ షెల్టరు ఉండడం అది కూడా 50 మందికి మాత్రమే పరిమితం కావడంతో అభాగ్యులకు ఫుట్‌పాత్‌లే శరణ్యమని చెప్పవచ్చు. ఉన్న ఒక్క షెల్టరులో కూడా వృద్ధులకు మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ షెల్టర్లలో అనాధలు, వృద్ధులు, అభాగ్యులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి అవసరమైతే రాత్రి బస ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట సమయంలో వచ్చేవారికి భోజనం ఏర్పాటు చేయాలి. కానీ కడప నగరంలో అటువంటి దాఖలాలు లేవు. ఎవరైనా దాతలు భోజన వసతి కల్పిస్తే వృద్ధులకు భోజనం పెడుతున్నారు.

ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్లు వారికి ఆవాసాలు

కడప నగరంలో రాత్రి అయితే రైల్వేస్టేషన్, బస్టాండు, పాత కలెక్టరేట్, సీఎస్ఐ ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, అరుగులమీద అనాథలు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, మతిస్థిమితం లేనివారు ఎక్కువగా కనిపిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుగాడే ప్రాంతాలైనా వారి కంటికి కనిపించకపోవడం బాధాకరం.

ప్రతి విద్యార్థికి లక్ష్యం.. ప్రణాళిక ముఖ్యం

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని రీజనల్ జాయింట్ డైరెక్టరు డాక్టర్ డి.గిరి విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 2024-25 ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మహిళా సాధికారత, మహిళల విద్య ఆవశ్యకతను వివరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను ఉదహరిస్తూ విద్యార్థినుల భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా కవితల రూపంలో విద్యార్థినులు ఉన్నతభవిష్యత్తును కలిగి ఉండాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ యోగాంజనేయులు, డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ రవికుమార్, మైదుకూరు ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ శ్యామ్యుల్, డేవిడ్‌రాజ్, ఓబీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌పై అవగాహన అవసరం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ పురుగుల నివారణ పద్ధతి యాప్‌పై రైతులతో పాటు వ్యవసాయాధికారులుకు అవగాహన అవసరమని ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వీరయ్యచౌదరి అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌పై వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చౌదరి మాట్లాడుతూ యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు మాట్లాడారు. వైఎస్ఆర్, అన్నమయ్యజిల్లాల ఏడీఏలు మాధవీ, మజీద్, టెక్నికల్ ఏవో గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దు : ఎస్ఈ



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

మైదుకూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలను ఎక్కడ రాజీపడకుండా వసూళ్లు చేయాలని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ అధికారులకు ఆదేశించారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులు, బిల్లుల గురించి విచారణ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యుత్ బకాయిలు చెల్లించలేని విని యోగదారుల కరెంటు కనెక్షన్ తొలగించాలన్నారు. ఈ తనిఖీలో ఇంజనీర్లు భరణి కృష్ణ, శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి

● డ్వామా పీడీ వెంకట రత్నం

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో పురోగతి సాధించాలని డ్వామా పీడీ టి.వెంకటరత్నం ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో కోడూరు, చిట్వేలి, పెనగలూరు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సంచార్ యాప్‌లో ప్రతి రోజు ఉపాధి హామీ పనుల ఫొటోలు అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరుపై ఏపీఓలు ప్రతి రోజు నివేదికలు సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని, అవినీతి జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

పెనగలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి: కొండూరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై మంగళవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ ప్రతాప్, కొండూరు సచివాలయంలో విచారణ చేశారు. తమకు కూలి సక్రమంగానే అందిందని, ఎటువంటి అవక తవకలు లేవని పీడీ, ఏపీడీ ఎదుట కూలీలు వివరించారు. బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లిన వారిపేర్లు కూడా మస్టర్లలో ఉండడంపై మరోసారి విచారణ చేయనున్నట్లు పీడీ విలేకరులకు తెలిపారు. ఎంపీడీవో విజయరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉపాధిహామీ పథకం నిధులతో మండలంలోని ఈటమాపురం, కంబాల కుంట గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్డు పనులను పీడీ తనిఖీ చేశారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన సిరిగేపల్లి యశ్వంత్‌ను మంగళవారం అంబకపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ తెలిపారు. పట్టణంలోని వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న కళ్ల శృతి అనే యువతిని యశ్వంత్ గత మూడు సంవత్సరాలుగా ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యశ్వంత్‌పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. అనంతరం కడప కోర్టుకు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్టు

కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కడపనగరం ప్రకాశ్‌నగర్ వద్ద ఈ నెల 23న హోంగార్డు అతని సోదరులపై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని ప్రకాశ్‌నగర్ వద్ద అరెస్టు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ప్రకాశ్‌నగర్‌కు చెందిన హోంగార్డు షేక్ లాల్‌బాషా, అతని సోదరుడు సర్ధార్‌బాషాలు ముత్తరాసుపల్లెకు చెందిన రంగాకు కొంత డబ్బు బాకీ ఉన్నారు. డబ్బు విషయమై ఈనెల 23న రంగా షేక్‌లాల్‌బాషాల మధ్య మాటామాటా పెరిగింది. దీంతో రంగా జిలానీ, అరుణ్‌కుమార్, మనోజ్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి వారిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఐదు గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాయచోటి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ నెంబరు చౌక దుకాణంలో పనిచేసే శ్రీను అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని కురవపల్లికి చెందిన శ్రీను కొంత కాలంగా పట్టణంలోని బోస్ నగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఆయన మంగళవారం ఉదయం వరిగపాపిరెడ్డిగారి పల్లెకు వెళ్లే దారిలో మృతి చెంది కనిపించాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృత దేహం పక్కనే మద్యం సీసా ఉండడంతో, మద్యంలో విషం కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

పెన్షనర్లకు కమ్యుటేషన్ కట్ చేయకుండా ప్రభుత్వ మెమో

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి 135 నెలలు నిండిన పెన్షనర్లందరికీ బేసిక్ పే నుంచి కమ్యుటేషన్ (40శాతం) మొత్తాన్ని కట్ చేయకుండా ప్రభుత్వం మెమో విడుదల చేసిందని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు నారాయణ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ఈ మెమో అములులో ఉంటుందన్నారు. 135 నెలల పెన్షన్ కాలం ముగిసిన వారందరికీ ఈ మెమో ద్వారా ఆర్థిక లాభం కలుగుతుందని చెప్పారు. కోర్టు ఉత్తర్వులు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన మెమో ద్వారా రాష్ట్రంలోని అన్ని ట్రెజరీ కార్యాలయాలకు ఉత్తర్వులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించిన కడప చిన్నారి అమీనా



కడప స్పోర్ట్స్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : కడప నగరానికి చెంది న చెస్ క్రీడాకారిణి (8) అమీనా చదరంగంలో అంతర్జాతీయ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ (1407) సాధించింది. చెన్నై నగర రాయపేటలో గత జులైలో జరగిన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో రేటెడ్ క్రీడాకారుడిపై అమీనా విజయం సాధించడంతో ఆ రేటింగ్ దక్కినట్లు జిల్లా చెస్ కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. నగర శివారు ప్రాంత విస్‌డమ్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న అమీనా చదరంగంలో మునుముందు మరిన్ని స్ఫూర్తిదాయక విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

ప్రతి పౌరుడు రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, నవంబర్ 26 (అంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు రాజ్యాంగం ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను తప్పక తెలుసుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాముఖ్యత, ముసాయిదా కమిటీ, అవిశ్రాంత ప్రయత్నాల గురించి దేశ పౌరులకు అవగాహన కల్పించడం, గుర్తు చేయడం కోసం రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులు అర్పించేందుకు నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. పౌరుల ఆకాంక్షలకు, సమాజంలోని మార్పులకు అనుగుణంగా ఉండాలని భావించి భారత రాజ్యాంగం రూపొందించబడిందన్నారు.

విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులు

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. కడప నగరంలోని బసిరెడ్డి లా కళాశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సులను సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ నిర్వహించి భారత రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమాలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, మొదటి అదనపు, ఆరవ, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తులు వెంకటేశ్వరరావు, షేక్ ఇంతియాజ్ అహ్మద్, జి.రమేష్‌కుమార్, అయా కోర్టుల జడ్జిలు ప్రవీణ్‌కుమార్, కె.ప్రత్యూషకుమారి, జె.హేమస్రవంతి, జె.నందిని, కె.భార్గ వి, జి.విజయలక్ష్మి, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న ప్రధాన జడ్జి శ్రీదేవి, జడ్జిలు, న్యాయవాదులు తదితరులు

రాజ్యాంగ ఫలాలు అర్హులకు అందించాలి

● జడ్పీ సీఈవో ఓబులమ్మ

కడప రూరల్, నవంబర్ 26(అంధ్రజ్యోతి): రాజ్యాంగ ఫలాలు అర్హులకు అందేలా అధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం వేడుకలను జడ్పీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వల్లూరు జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్‌ఎస్‌ను రైతులు ఉపయోగించుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

కడప రూరల్, నవంబర్ 26 (అంధ్రజ్యోతి): పంటలకు ఆశించు పురుగులను నివారించి తద్వారా ఆశించిన దిగుబడులను సాధించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన నేషనల్ పేస్ట్ సర్వేయిలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్‌ఎస్) యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఏ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం పురుగుల నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖలో రైతులకు ఉపయోగకరమైన మార్పులు వస్తున్నందువలన ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ రైతులకు చాల ఉపయోగకరమన్నారు. రైతులకు పురుగులు, తెగుళ్లు, నివారణా చర్యలు ఈ యాప్ ద్వారా త్వరగా తెలుసుకొని తద్వారా పంటలను రక్షించుకోవచ్చన్నారు. రైతులు వారి ఆండ్రాయిడ్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా ఎన్‌పీఎస్‌ఎస్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. దానిలో వారు పండించే పంటలకు సంబంధించి ఏదేని చీడ పీడలు ఆశించినప్పుడు వాటి ఫొటోలను యాప్‌లో ఉంచితే.. ఎలాంటి నివారణా చర్యలు తీసుకోవాలో తెలుసుకోవచ్చన్నారు. విజయవాడ కార్యాలయం నుంచి వచ్చిన ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్య చౌదరి ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలో వివరించారు. యాప్ ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎం.మాధవి, మజీద్ అహ్మద్, టెక్నికల్ ఏవో గోవర్ధన్, మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యసాయశాఖాధికారి నాగేశ్వరరావు

అరాచక పాలనతో అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు

● వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు26(అంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చినప్పటి నుంచి అరాచక పాలనతో రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. జగన్‌పైన నిరాధార ఆరోప ణలతో పాలనను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. మంగళవారం రాయచోటిలోని వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడం మంచి సంప్రదాయం కాదన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో ఆలోచించి వ్యక్తులను కులాలతో విడదీస్తుండడం బాధాకరమ న్నారు. ఏ ఒక్కరు గొంతు విప్పినా పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేయడం, వారిని వ్యక్తిగతంగా బెదిరించడం, చట్టంలోని లొసుగుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ఎవ్వరిపై కూడా అసభ్యకర పోస్టులు పెట్టకూడదని, ముఖ్యంగా మహిళలను కించపరిచే పోస్టులను తమ పార్టీ సమర్థించదన్నారు. ప్రభుత్వ విధానాల్లో తప్పిదాలను ఎత్తి చూపితే కూడా కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు మేలు జరగ లేదని కూటమి నేతలు గగ్గోలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ లను ఆరు నెలలు అవుతున్నా ఇంతవరకు అమలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. రాయచోటి మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్ గౌస్‌ఖాన్, బీసీ సెల్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

రైస్‌పుల్లింగ్ పేరిట రూ.1.34 కోట్లకు మోసం

ప్రొద్దుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రైస్ పుల్లింగ్ పేరిట రూ.134కోట్ల మోసానికి పాల్పడ్డ ముగ్గురు మహిళలపై చీటింగ్ కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. దువ్వూరు మండలం గోపలాపురం గ్రామానికి చెందిన మూలేవెంకట రమణారెడ్డి వడ్ల వ్యాపారం చేసేవాడు. అతని భార్య ఆర్టీసీ కండెక్టర్. ఆమెకు పరిచయం ఉన్న ప్రొద్దుటూరు పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శోభారాణి రైస్‌పుల్లింగ్ వ్యాపారాన్ని పరిచయం చేసింది. ఇందులో పెట్టుబడి పెడితే ఒకటికి పదింతలు డబ్బులు వస్తాయని ఆశ చూపింది. దీనికి సంబంధించి తమ కజిన్స్ అయిన బెంగళూరుకు చెందిన అపర్ణ, కదిరికి చెందిన అరుణను పరిచయం చేసింది. దీంతో రమణారెడ్డి ప్రొద్దుటూరులో తనకు తెలిసిన వారందరితో రైస్‌పుల్లింగ్ వ్యాపారంలో దాదాపు రూ.1.34 కోట్ల పెట్టుబడులు పెట్టించాడు.

అయితే వీరిలో ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి కూడా లాభం రాలేదు. దీంతో మోసం చేశారని వీరిపై మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. ఆ ముగ్గురు మహిళలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. కాగా ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మార్కెట్ యార్డులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయండి

● కలెక్టర్‌కు టీడీపీ నేత జయచంద్రారెడ్డి వినతి



సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మార్కెట్ యార్డులో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కోరారు. స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షాలో పాల్గొన్న కలెక్టర్‌ను ఆయన కలిసి పలు సమస్యలను విన్నవించారు. ప్రతి రోజు వందలాది మంది రైతులు, కూలీలతో టమోటా మార్కెట్ జరుగుతోందని, ఇలాంటి చోట అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే మంచిదని, అలాగే ములకలచెరువు బస్టాండు సర్కిల్ సమీపంలో జాతీయ రహదారి పక్కన 110 ఏళ్ళ క్రితం బ్రిటీషు దొరలు నిర్మించిన బంగ్లా శిథిలమైందని, పంచాయతీ రాజ్ విశ్రాంతి భవనంలా ఉండేదని ఇక్కడ కొత్తగా విశ్రాంతి భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త నీడు మల్లికార్జుననాయుడు ఉన్నారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుర్రంకొండ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో ప్రభావంతో కురిసే వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రాబోవు రెండు రోజులు తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు అధికంగా పడే అవకాశం ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించి జాగ్రత్తలను తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే చెరువులు, కుంటల పరిస్థితిని తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ములకలచెరువులో ముసురు వాన

ములకలచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ములకలచెరువులో ముసురు వాన కురుస్తోంది. మంగళవారం ఉదయం నుంచి ముసురు వాన కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ఇళ్లకే పరిమితమయ్యారు. తుఫాను కారణంగా వర్షాలు మరింతగా పెరిగేఅవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

29న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

మదనపల్లె అర్బన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, నిమ్మనపల్లె రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(జీఎంఆర్)లో ఈ నెల 29న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్ డీసీ), జిల్లా ఉపాధి కార్యాలయం వారి సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో టాటా విస్టన్, టాటా క్యాపిటల్, ఎస్బీఐ లైఫ్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఇందులో పదవతరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న 18-33 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు మరెన్నీ వివరాలకు ఈ సెల్ నెంబర్లకు 9553 202509, 6301812761కు సంప్రదించాలన్నారు.

కొడుకు దాడిలో గాయపడిన తల్లి మృతి

పెద్దమండ్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) మద్య మత్తులో కొడుకు తల్లి పై దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు పెద్దమండ్యం మండలం సిగొల్లపల్లి గ్రామంలో బోడెం పెద్దన్న ఓబులమ్మ దంపతులచిన్న కొడుకు ఓబులేసు(35) తల్లి ఓబులమ్మ(60)ను డబ్బు ఇవ్వలేదని కోపంతో కర్ర తో దాడి చేసి తీవ్రంగా గాయపరచాడు. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అయితే అక్కడ కూడా ఆమె ఆరోగ్యపరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి చెన్నైకు తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. ఆర్థికస్థోమత లేని వారు ఇంటికి వచ్చేశారు. కాగా సోమవారం రాత్రి వృద్ధురాలు ఓబులమ్మ ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ములకల చెరువు సీఐ లక్ష్మన్న సి.గొల్లపల్లి లో పర్యటించి శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన

● వరి కోతల్లో బిజీబిజీగా అన్నదాతలు ● హార్వెస్టింగ్ యంత్రాలకు పెరిగిన డిమాండ్



యంత్రంతో వరి పంట కోయిస్తున్న దృశ్యం



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

తంబళ్లపల్లె, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఈ నెల 28 నాటికి బలపడి తుపానుగా మారనుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండ్రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండి మంగళవారం చిరుజల్లులు కురుస్తుండటంతో ఏ క్షణాన ఏ ఉపద్రవం ముంచుకొచ్చి చేతికందిన పంట దెబ్బతింటుందేమోనని దిగాలు చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే వరి పైరు నేలవాలి పంట దెబ్బతింటుందని భయాందోళనకు గురవుతున్నారు. తంబళ్లపల్లె మండలంలో ఖరీఫ్‌లో సుమారు 600 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా..సగానికి పైగా కోతలు పూర్తయ్యాయి. ముందుగా సాగు చేసిన రైతులు కొన్ని రోజుల కిందటే పంట కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మిగిలిన రైతులు గత నాలుగైదు రోజులుగా వరి కోతల పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఏ వరి పొలంలో చూసినా యంత్రాలతో వరి కోతలు కోసి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకునే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. దీంతో వరి కోత యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. అయితే మండలంలో ఇంకా చాలా వరకు వరి పంట కోయని పరిస్థితి నెలకొనగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి కోత యంత్రాలకు పెరిగిన డిమాండ్

తుపాను హెచ్చరికలతో రైతులు హార్వెస్టింగ్ యంత్రాలతో వరి కోతలను ముమ్మరం చేశారు. దీంతో యంత్రాలకు డిమాండ్ పెరిగింది. కూలీలతో అయితే ఎక్కువ సమయంతో పాటు ఖర్చు ఎక్కువగా వస్తుండటంతో యంత్రాలతో వరి పంటను కోయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే, యంత్రాలు మన ప్రాంతంలో లేకపోవడం, తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి సాగు రైతులందరూ ఒకే సారి కోతలకు సిద్ధమవ్వడంతో హార్వెస్టింగ్ యంత్రాలను శ్రీకాళహస్తి, తమిళనాడు నుంచి పిలుపించుకుని పొలాల వద్ద పడిగాపులు కాచి మరీ పంటలను కోయించుకుంటున్నారు. డిమాండ్ కారణంగా మరి కొంత మంది రైతులకు యంత్రాలు దొరక్కపోవడంతో భారీ వర్షాలు కురిస్తే చేతికందిన పంట దెబ్బతింటుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

యువతరంగ్ పోటీలకు మదనపల్లె విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కరస్పాండెంట్ తదితరులు

మదనపల్లె టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):సౌత్ ఇండియా స్థాయిలో నిర్వహించే అంతర్ యూనివర్సిటీ యువతరంగ్ పోటీలకు మదనపల్లె జ్ఞానాంబిక విద్యార్థినులు ఎంపికయ్యారని ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ పి.వివేక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్వీయూనివర్సిటీలో నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి యువతరంగ్ పోటీల్లో జానపద నృత్య పోటీల్లో పాల్గొన్న జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు లంబాడా నృత్యాన్ని ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించారన్నారు. అలాగే డిసెంబరు 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సౌత్ ఇండియా అంతర్ యూనివర్సిటీ యువతరంగ్ పోటీలకు ఎస్వీయూ తరఫున ఈ నృత్యబృందం ఎంపికైందన్నారు. వారికి నెల రోజుల పాటు నృత్యంలో తర్ఫీదు ఇచ్చి పోటీల్లో గెలుపొందే విధంగా శిక్షణ ఇవ్వాలని డ్యాన్స్‌మాస్టర్ సురేష్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను చదును చేస్తున్న వాహనాలు సీజ్



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్

మదనపల్లె అర్బన్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోళ్లబైలు పంచాయతీలోని ప్రభుత్వ స్థలంలో మంగళవారం అక్రమం గా చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌తోపాటు ట్రాక్టర్ ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా చదును చేస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయానికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో స్పందించిన తహసీల్దార్ ఖాజాబీ పరిశీలించాలని కోళ్లబైలు వీఆర్వోను ఆదేశించారు. వీఆర్వో శివశంకర్ అక్కడికి చేరుకుని స్థలాన్ని అక్రమంగా చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భం గా తహసీల్దార్ మాట్లాడుతూ వంకలను, వాగులను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలో ఎక్క డైనా ఆక్రమణలు జరుగుతుంటే స్థానికులు తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ కోరారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి):రోడ్డుప్రమాదంలో వృద్ధుడు గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. మదనపల్లె పట్టణం, రెడ్డీస్‌కాలనీకి చెందిన కేవీ రమణ(60) తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలం, గౌడసానిపల్లె వద్ద తనకున్న పొలం వద్దకు ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా కురబలకోట వద్ద మదనపల్లె నుంచి టమోటాల లోడుతో వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో రమణకు గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు మదనపనల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పంచాయతీ బండకాడపల్లి వద్ద జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఈ దాడిలో జూదరుల నుంచి రూ.4,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రామసముద్రంలో ఏడుగురు..

రామసముద్రం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనేవారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుమందిని అదుపులోకి తీసుకుని వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలి పారు. వారి వద్ద నుంచి రూ.5130 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



వాల్మీకిపురంలో ఊరేగుతున్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

వాల్మీకిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని పడమర పొలిమేర ధర్మపథంలో మూడో వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చివరి రోజు షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో అభిషేకం, హోమాలు పూర్తి చేసి వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారిని పుష్ప పల్లకిలో పట్టణ పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవ వేడుకలు విశేష భక్తజనం నడుమ నిర్వహించారు. అనంతరం పురుష మృగ వాహనోత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి. ఉత్సవాలు సందర్భంగా ఆలయంలో భక్తులకు తీర్థ, ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

4న అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ

మదనపల్లె అర్బన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి):స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో డిసెంబరు4న అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 15 వరకు పూజా కార్యక్రమాలతోపాటు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో మంగళవారం అయ్యప్ప భక్తులకు ఢీల్లిరెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా ఆలయన కమిటీ సభ్యులు కలికిరికి వెళ్లి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని మంగళవారం అయ్యప్పస్వామి పడిపూజకు ఆహ్వానించారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఒంటిమిట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామంలో ఆంజనేయాలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలో 5 జతల ఎద్దు పాల్గొనగా సర్పంచ్ చంద్రబాబురెడ్డి ఎద్దు ప్రథమస్థానంలో, ప్రొ ద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన వెంకటసుబ్బా రెడ్డి ఎద్దు రెండో స్థానంలో , చాపాడు మండలం రాజువారిపేటకు చెం దిన శ్రీకాంత్‌రెడ్డి ఎద్దు మూడో స్థానంలో నిలిచాయి.

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో పురోగతి సాధించాలని డ్వామా పీడీ టి.వెంకట రత్నం ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో కోడూరు, చిట్వేలి, పెనగలూరు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సంచార్ యాప్ లో ప్రతి రోజు ఉపాధి హామీ పనుల ఫొటోలు అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరుపై ఏపీఓలు ప్రతి రోజు నివేదికలు సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని, అవినీతి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

పెనగలూరు : కొండూరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై మంగళవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ ప్రతాప్, కొండూరు సచివాల యంలో విచారణ చేశారు. తమకు కూలి సక్రమంగానే అందిందని, ఎటువంటి అవకతవకలు లేవని పీడీ, ఏపీడీ ఎదుట కూలీలు వివరించారు. బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లిన వారిపేర్లు కూడా మస్టర్లలో ఉండడంపై మరోసారి విచారణ చేయనున్నట్లు పీడీ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయరావు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి

చిట్వేలి, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : స్వర్ణ పంచాయతీ సైట్‌లో డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి పంచా యతీ కార్యదర్శి, సిబ్బందికి సూ చించారు. చిట్వేలి గ్రామ పంచా యతీ కార్యాలయాన్ని మంగళ వారం ఆయన ఆకస్మికంగా తని ఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ శివకుమార్, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, శివకుమార్, సిబ్బంది నరసింహా, వెంకటేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం పట్టణం నడిబొడ్డున ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ కంప చెట్ల మధ్య అటవీ ప్రాంతాన్ని తలపించేలా ఉంది. ప్రభుత్వ కార్యాలయాల నడుమ ఉన్న వాటర్ ట్యాంక్ పరిసరాలు పరిశుభ్రతకు నోచుకోక పాములు తదితర విషపురుగులకు నిలయంగా మారింది. ఇలాంటి చోట ట్యాంక్‌ను పరిశుభ్రం చేయాలంటే సిబ్బందికి ఇబ్బందులే.. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

-వాల్మీకిపురం, (ఆంధ్రజ్యోతి)

హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో సీమవాసులకు మేలు



బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న న్యాయవాదులు

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రజలకు కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మదనపల్లె న్యాయవాదులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా టీడీపీ న్యాయవిభాగం అధ్యక్షుడు గణపతి విలేకర్లతో మాట్లాడుతూ శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు దక్కాల్సిన హైకోర్టు బెంచ్‌ను నేడు సీఎం చంద్రబాబునాయుడు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 151 జారీ చేశాయడం న్యాయవాదులకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం చంద్రబాబు కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. న్యాయవాది మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అందరికి ఆమోదయోగ్యంగా ఉందని దీని వలన కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. న్యాయవాది గోపాలకృష్ణ మాట్లాడుతూ కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం వలన నాలుగు జిల్లాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.సంపత్, ఎం.నాగరాజ, రఫి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలు



పీలేరులో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు



మదనపల్లెలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పీలేరు/మదనపల్లెటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు పీలేరు పంచాయతీ కార్యాలయ కూడలి వద్దనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, పద్మావతమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, నాయకులు పాలకుంట శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, తుమ్మల ధరణీకు మార్, జెట్టి మల్లిఖార్జున, సుభాష్, ముల్లంగి గురవయ్య, దుద్దు రామకృష్ణ మాదిగ, గండికోట వెంకటేశ్, చరణ్ కుమార్, రాజమ్మ, హరినాయక్, హరినాథ్, రమణ పాల్గొ న్నారు. మదనపల్లె జడ్పీ హైస్కూల్లో రిటైర్డ్ డీజీపీ ఇ.రాధాకృష్ణ సూచనల మేర కు పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ఇందులో గెలు పొందిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బి.కొత్తకోటలో ఘనంగా జరుపుకున్నారు. జ్యోతిసర్కిల్ లో వున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి, ఏవో రమాదేవి, బాస్ నాయకులు సచిన్, సింగన్న, వెంకటేష్, మాధవ, మహేష్, మస్తాన్, సమీవుల్లా, అంజి, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న అపార్ ఐడీని జనరేట్ చేసుకోవాలి



అపార్ ఐడీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి

నిమ్మనపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పెండింగ్‌లో ఉన్న అపార్ ఐడీని జనరేట్ చేసుకోవాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఎంఈవో పద్మావతి పేర్కొ న్నారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూ లో అపార్ ఐడీ వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ తప్పని సరిగా వారి జనన ధ్రువపత్రాలను ఆధార్ సెంటర్‌లో సమర్పిం చడం ద్వారా పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. జననధ్రువపత్రాల కోసం దర ఖాస్తు చేసుకొన్న ప్రతి విద్యార్థికి త్వరితగతిన పత్రాలు మంజూరు చేయాలని కార్య దర్శులను ఆదేశించారు. అలాగే 1వతరగతి నుంచి 12వతరగతి వరకు 4304 మంది విద్యార్థులు ఉండగా 3500 మంది అపార్ ఐడీని చేసుకొన్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: విద్యార్థుల అపార్ ఐడీ రిజిస్ట్రేషన్లను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఎంఈవో త్యాగరాజు ఆదేశించారు. మంగళవారం ఎంఈవో స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, అందుతున్న వసతులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ మేరకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలలోని పలు ప్రశ్నలు అడిగి వారి నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. వచ్చే ఏడాది వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట నారాయణ, జనార్ధన్, సీఆర్పీలు సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

అపార్ కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

పీలేరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అపార్ నమోదు కోసం పీలేరు పట్టణంలో మూడు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంగళవారం ఎంపీడీవో శివశంకర్, ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు క్వార్టర్స్ ఎదురుగా ఉన్న సచివాలయం-5, కోటపల్లె రోడ్డులోని సచివాలయం-3, కడప రోడ్డులోని బోడుమల్లువారిపల్లె సచివాలయంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు. ఈ ప్రత్యేక కేంద్రాలు వచ్చే నాలుగు రోజులపాటు పనిచేస్తాయని, మండలంలోని అన్ని విద్యాసంస్థలు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు శ్రీరామరక్ష



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన టీడీపీ నేత త్యాగరాజు

ములకలచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు శ్రీరామరక్షని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. మండలంలోని దేవళచెరువులో మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రషీద్, వెంకటమల్లు, ఉత్తమనాయుడు, శివారెడ్డి, శ్రీనివాసులు, చలపతి, లక్ష్మీపతి, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల లోగో ఆవిష్కరణ



మిట్స్ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మిట్స్ లోగోను ప్రిన్సిపాల్ యువరాజ్, తులసీరామ్‌నాయుడు, శివయ్య తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఇంజనీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు తమ వ్యాపారాలను ప్రారంభించడానికి ఆసక్తి ఉన్న వారికి మిట్స్ ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తమలోని నూతన ఆలోచనలను బయట పెట్టి పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ఇంజనీర్లకు మంచి అవకాశమని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.